ప్రజాశక్తి

Vol. 6, no. 22

(May. 30, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 6, no. 22

(May. 30, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Reqd. No M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 6 బుధవారం 30-5-45 సంచిక 22

వ్యవసాయ ఆదాయాలపై పన్ను

ప్రభుత్వానికి ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ సూచనలు

మద్రాసుప్రభుత్వం వ్యవసాయంవల్ల రు. 5000 లకు పైగా వచ్చే ఆదాయాలపై పన్నువేయడానికి ఒక బిల్లును ప్రకటించింది. ఈబిల్లు ఒక ప్రధాన సమస్యను ముందుకు తీసుకువచ్చింది కాబట్టి దీన్ని గూర్చి స్పష్టంగా తెలుసుకోవలసివుంది.

నేటి భూమి శిస్తు విధానం

నేటి భూమి శిస్తువిధానంలో ముఖ్యవిషయా లేమిటి ?

1. సెంటుభూమివున్నా, వెయ్యి యెకరాలువున్నా, ఒకే రేటున అందరిపైనా పన్ను వేయబడుతుంది. తాహతును బట్టి పన్ను విధించేపద్ధతి లేదు.

2. ఒక మామూలు రైతుయొక్క కుటుంబ పోషణకవసరమైన కనీస ఆదాయమును కూడ మినహాయించక, ఆదాయం మొత్తంపై పన్ను విధిస్తున్నారు.

3. పెద్దపెద్ద ఆదాయాలువచ్చే జమీందార్లు, అగ్రహారందార్లు, మొదలైనవారిపై చాలా స్వల్పమైన పన్ను మాత్రం (పేష్కసు, క్విట్‌రెంటు రూపాలలో) వేయబడుతోంది.

ఈ విధానంవల్ల కృంగిపోయేది పేదరైతులు. శిస్తుభారం నుండి తప్పించుకొనేది జమీందార్లు, పెద్ద భూఖామందులు. ఉదాహరణకు చూద్దాం. 1350 ఫసలీలో 2,76,11,569 యకరాల రైత్వారీ భూమిపై రు. 7,57,41,000 ల శిస్తు చెల్లింది. కాని జమీందారీలలో 1,28,42,230 యకరాలు సాగయి. జమీందార్లకు రు. 2,04,00,000లు శిస్తులువస్తే ప్రభుత్వానికి పేష్కసు క్రింద చెల్లించింది రు. 47,50,000 మాత్రమే అదే ఫసలీలో రు. 1—0—0 గాని, అంతకు తక్కువగాని, శిస్తుచెల్లించే పట్టాదార్లు 14,65,475 మంది వున్నారు. వీరిక్రిందవున్న భూమి 9,28,778 ఎకరాలు మాత్రమే. అంటే సగటున 60 సెంట్లు పండిందన్నమాట. ఈభూమిలో 61,527 ఎకరాలుమాత్రమే పల్లం. అంటేరైతులు ఎంత నికృష్టజీవనం గడుపుతున్నారో, వీరి కెంత ఆదాయం వస్తుందో చూడండి. అయినా వీరుకూడా 1000 ఎకరాలున్న భూస్వామివలెనే పన్ను చెల్లించాలి!

ఇదే ఫసలీలో రూపాయికి పైనా, రు. 10 లకు లోపూ, శిస్తు చెల్లించే పట్టాలు (వీటిలో చాలా జాయింటు పట్టాలు) 36,52,536 వున్నాయి. మొత్తంఉన్నభూమి 1,03,26,190 యకరాలు. అంటేఒకొక్కక్క పట్టాక్రింద సగటున దాదాపు 3 ఎకరాలు అన్నమాట. ఇందులోపల్లం 9,26,695ఎకరాలు; మెట్ట 93,99,495 ఎకరాలు. చెల్లించేశిస్తు రు1,52,49,503లు ఈపట్టాదార్లలో తమ భూమి యావత్తూ మాగాణిగానో, పొగాకు, మిర్చి పండేచక్కటి తోటభూమిగానో వుంటేతప్ప ఇతరులకు వచ్చే ఆదాయమేమిటి? వాళ్ళు ఈ భూమిపై బ్రావుకుతినేదేమిటి?

ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. కుటుంబపోషణకు కూడా చాలని ఆదాయంవచ్చే రైతులెంతమందో వున్నారు. కాని వారి ఖర్చులలో ఎక్కువ మొత్తం పన్నుకే పోతూంది. అనేకమంది రైతులు పన్ను చెల్లించుకోలేక పోవటం, భూములు పోగొట్టుకోవడం మనకు అనుభవాలే. కాబట్టి ఇటువంటి ఆదాయాలపై పన్నును పూర్తిగా మినహాయించటం సరియైనభూమి పన్నువిధానం.

సామాన్య కుటుంబంయొక్క పోషణకు అవుసరమైన ఆదాయాన్ని ప్రమాణంగా తీసుకుంటే, అపైవచ్చే ఆదాయాన్ని మిగులుగా భావించవచ్చు. ఆ ఆదాయాలు పన్నులను భరించగలవన్నమాట. ఆదాయం పెరిగిన కొలదీ పన్నును భరించేశక్తి కూడా పెరుగుతూవుంటుంది. అంటే, తాహతును బట్టి పన్నువిధించబడుతుంది. ఇది సరియైన భూమి పన్ను విధానం.

ఈ సూత్రము ననుసరించి భూమిశిస్తు విధానముండాలని ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం గత 10 సంవత్సరాల నుండి ఆందోళన చేస్తున్నది. కుటుంబపోషణకు సరిపోయే నికరాదాయం రు 250/- లను పూర్తిగా పన్నునుండి మినహాయించి, ఆపైన వచ్చే ఆదాయములపై వృద్ధిక్రమానుసారంగా హెచ్చుపన్నులను వేయాలని సూచించింది.

కీ॥ శే॥ కొమ్మారెడ్డి నాయకత్వాన బయలుదేరిన చరిత్ర ప్రసిద్ధమగు రైతురక్షణ యాత్రికులంవారు కాంగ్రెసు మంత్రివర్గానికి సమర్పించిన మెమొరాండంలోకూడా పై సూత్రము ననుసరించే భూమిపన్ను విధానముండాలని కోరబడింది.

కాంగ్రెసు మంత్రివర్గం పై సూత్రాన్ని అనుసరించి పన్నులవిధానాన్ని సంస్కరించుటకు ఆలోచించింది. కాని ఏ నిర్ణయానికి రాకముందే రాజీనామా యిచ్చింది. ఇప్పటికి అడ్వయిజర్ల ప్రభుత్వం వ్యవసాయాదాయములపై పన్ను విధించుటకై ఒక చిత్తుచట్టాన్ని ప్రజాభిప్రాయంకొరకు ప్రకటించింది. అందులోని విషయాలివి :

(1) రు. 5000/-పైబడ్డ వ్యవసాయాదాయములపైనే పన్ను విధించబడుతుంది. ఆదాయం హెచ్చిన కొద్దీ పన్నురేటు హెచ్చుతుంది.

(2) అవిభక్త కుటుంబాలపైనా, కంపెనీలపైనా ఒకే రేటున పన్ను విధించబడుతుంది.

(3) పన్నుఎక్కువ తక్కువలగూర్చి, ఆదాయం లెక్కలగూర్చి వచ్చే వివాదాల విషయంలో ప్రీవీకౌన్సిలుకు అప్పీలు చేసుకొనేవరకూ అవకాశంవుంది.

ఈ బిల్లునుగూర్చి ప్రభుత్వం చేసిన ప్రకటనలో పన్నును విధించుటలో తమ ఉద్దేశాన్ని ఈవిధంగా తెలియజేశారు.

(1) లోగడ పెద్ద ఆదాయాలపై భరించగలిగినంత పన్ను విధించుటలేదు. కాబట్టి యీ పన్ను వేయడమైనది.

(2) యుద్ధానంతరం అభివృద్ధికై వేయబడే స్కీములకు మూలధనం సేకరించాలి.

(3) క్రమేణా యీ పన్ను విధానాన్ని అభివృద్ధిజేసి, చిన్న రైతులను పన్నులభారంనుండి తప్పించాలి.

బిల్లు నెందు కంగీకరిస్తున్నాము?

ఈ బిల్లు సర్వాంగసుందరంగా లేకపోవచ్చు. ఇందులో పెద్ద లోపమేమిటంటే, చిన్న రైతులను పూర్తిగా శిస్తుల భారాన్నుండితొలగించే పద్ధతిభవిష్యత్తుకుమాత్రమేవదలివేయబడింది. ముఖ్యంగా యీనాడు బీద రైతులు విశేషంగా నలిగిపోతున్నారు. ధాన్యం ధరలు హెచ్చినా, లాభం పెద్ద రైతులకేగాని బీద రైతులకేమాత్రం లేదు. కారణం : వారు అమ్ముకుంటానికే గింజలు మిగలవు. తిండి గింజలలో తప్పనిసరిగా కొంతభాగం అమ్ముకోకపోతే, సరియైన మార్కెటింగు సౌకర్యాలు లేనందున వచ్చే ధర తక్కువ. పైగా రీ శెటిల్మెంటు రేట్లవిధింపు వీరిమీదే [illegible] కాబట్టి వీరికి వెంటనే పన్నుల మినహాయింపును తలపెట్టకపోవడం పొరపాటు.

అయితే, ఇంతమాత్రంచేత బిల్లును నిరాకరించము. కారణం, పైన చెప్పబడ్డ ఉద్దేశాలు మంచివి కావటం. యుద్ధానంతర స్కీములకు - అసలు ఏ స్కీములకైనా - మూలధనం కావలసివస్తే, మామూలుగా ప్రజలందరిపైనా పన్నులు రుద్దటం యింతవరకు పరిపాటి అయిపోయింది. వీటిఫలితాలనూ, లాభాలనూ పొందేది యెక్కువగా పై తరగతులవారైనా, పేద రైతులపైననే యీ భారం యెక్కువగా పడుతూవుంటుంది. లేదా, మరో వినాశకరమైన పద్ధతి ఉన్నది. తాతా-బిర్లాప్లాను సూచించినదీమార్గమే. అదే ఇన్‌ప్లేషన్ (చెలామణీలోకిఎక్కువ డబ్బు తెచ్చుట) దీని దుష్ఫలితాలను ఇప్పుడు చక్కగా అనుభవిస్తున్నాము. ఇదే పద్ధతిని యుద్ధానంతరం స్కీములకు వర్తింపజేస్తే, ఇక బీదాబిక్కీకి బతుకుతెరువున్నదా ? ప్రభుత్వం ఈ రెండు తప్పుడు పద్ధతులకూ పూనుకోక, ధనవంతులపై పన్నుల ద్వారా ఈ మూలధనాన్ని సేకరించుట ముదావహం.

ఈ విధానాన్ని అభివృద్ధిజేసి, బీదరైతులపై పూర్తిగా పన్నులు తీసివేయడం తమ వుద్దేశమని ప్రభుత్వం తెల్పింది. అందుకవకాశం వుంది. కాని ఇప్పుడే అలా చేయడానికి ఈ ప్రభుత్వం భయపడుతోంది. ఉదాహరణకు, రు. 10 లు శిస్తు చెల్లించే వారందరికీ పన్నులు రద్దుచేసిందనుకుందాము. అంటే ప్రభుత్వాదాయంలో రు 1,61,40,396 లోటువస్తుందన్నమాట. ఇంతలోటుతో ఎట్లా బడ్జెటును సరిపెడదామా అనేది వారి దిగులు. కాని ప్రజా ప్రభుత్వమే ధైర్యంగా ఈ అడ్వయిజర్లు విధించే పన్నులకన్న హెచ్చుపన్నులు ధనవంతులపైవేసి, బడ్జటును సరిపెట్టేది. యుద్ధానంతర స్కీములకు తగినంత మూలధనాన్ని సమకూర్చేది. అందుచేత, ఇప్పుడే బీదరైతులకు బరువు వొదలకపోయినా, వొదిలించుట కవకాశముంది. కాబట్టి ఈ బిల్లును సమర్థించవలసి యున్నది.

ఇప్పుడు ప్రభుత్వం తలపెట్టిన (మిగతా ప్రక్క పేజీలో)

నండూరి ప్రసాదరావు

వేయరా వేయరా వరినారు

వేయరా వేయరా వరినారు
వేగంగ వేయరా వరినారు
ఒత్తైతె పనపైరు ఉత్తనే పోతుంది
పల్చనైతే గింజ రాల్చువనియేలేదు
వేయరా వేయరా వరినారు
నిండుగా దండిగా వరినారు—

డొక్క నిండామేత దొరికి జోడెద్దులు
మట్టు లెగబట్టి రంకేసి దూకాలిరా
వేయరా వేయరా వరినారు
వేగంగ వేయరా వరినారు—

కరువుతో రోగాల బరువుతో సగమైన
వంగసోదరుడింక బ్రతికి బైటపడాలి
వేయరా వేయరా వరినారు
వేగంగ వేయరా వరినారు—

పల్నాటిగడ్డలో విశాఖ సీమలో
కరువురాకాసిని తరిమికొట్టాలిరా
వేయరావేయరా వరినారు
చొక్కంగ వేయరా వరినారు—

నాటిన ప్రతిమొక్క నాటుకుంటుందిరా
శత్రులా గుండెలో గాలమై శూలమై
వేయరా వేయరా వరినారు
సూటిగాపాటుగా వరినారు—

కరకు కత్తినిదూసి ఉరికి రణరంగాన
పోరాడు వీరులకు పుష్టినివ్వాలిరా
వేయరావేయరా వరినారు
చొక్కంగ చక్కంగ వరినారు.

— ప్రయాగ కోదండరామశాస్త్రి

(1వ పేజీ తరువాయి)పన్ను ఎవరిమీద పడుతుంది? వ్యవసాయపు ఖర్చులు. పంట. ఇన్సూరెన్సు ప్రీమియము. వ్యవసాయోపయోగానికిగాని. శిస్తు వసూళ్ళకుగాని ఉద్దేశింపబడ్డ భవనాల మరమ్మతు ఖర్చులు.శిస్తు వసూలు ఖర్చులు. మొదలైన అనేక ఖర్చులు మినహాయించగా వచ్చిన నికరాదాయం రు. 6000 లకు మించుతేనే పన్ను పడుతుంది. అంత ఆదాయం ఎవరికి రాగలదు? జమీందార్లకూ, పెద్ద అగ్రహారం దార్లకూ, పెద్ద భూస్వాములకు మాత్రమే ఇంత ఆదాయం వస్తుంది. చెల్లించవలసిన పన్ను యెంత వుంటుంది? మామూలుగా చెల్లించే భూమిశిస్తుగాక. రు. 6000లు నికరాదాయంపై ఈబిల్లు ప్రకారం చెల్లించేపన్ను రు. 226-9-0. నికరాదాయం రు. 12000 లు ఐతే రు. 664-1-0 మాత్రం. అవిభక్తకుటుంబంఅయితే.రు. 6000 ఆదాయానికి రు. 125 మాత్రం. రు. 30,000 అయితే రు.1281-4-0 మాత్రం. ఈవిధంగా ఇదివరకు స్వల్పంగా పన్ను చెల్లిస్తున్న పెద్దపెద్దఆదాయాలపై స్వల్పంగా మళ్ళీ పన్ను విధించబడుతుందన్నమాట. ఈ ధనం బీద రైతుల పన్ను భారం తగ్గించానికీ,యుద్ధానంతరం అభివృద్ధి స్కీములకూ వినియోగపర్చాలని ఉద్దేశించుతున్నారు. కాబట్టి ఎవరు ఈ పన్నును ఆక్షేపించగలరు?

పన్నును ఆక్షేపించేవారెవరు?

అయితేఈ బిల్లు. రాష్ట్రంలో పెద్ద గాలి దుమారాన్ని రేపింది. హేమా హేమీలు కొందరు దీన్ని తిట్టి పోస్తున్నారు. బెజవాడ రామచంద్రారెడ్డి. గోగినేని రంగనాయకులు. సర్ యస్. గోపాలస్వామి అయ్యంగారు. సామియప్ప మొదల్యారు. ముత్తురంగ ముదల్యారు. ఏ. పి. పాత్రోమహాశయో. లాంగ్లే. (పెద్ద తోటలయజమాని) చెముడు ఎస్టేటు దివాన్ భాస్కరరావు. టి ఆర్. వెంకట్రామశాస్త్రి మొదలైన వారందరూ.కూడబలుక్కున్నట్లుగా. ఒకే రీతిగా. పగలనకరాత్రనక ఈ బిల్లును విమర్శిస్తున్నారు. ఈ పన్ను గనుకపడితే పెద్దపెద్ద జమీందార్లు. భూస్వాములు. నీలగిరి తోటల యజమానులు చిప్ప చేతులో పుచ్చుకు బయలుదేరవలసిందేనంటున్నారు. ఇంకేముంది. రైతాంగమంతా నాశనమౌతుంది; కుటుంబాలన్నీ విచ్ఛిన్నమైపోతాయంటూ గగ్గోలు పెడుతున్నారు. అయితే. ఇంతకూ ఈ పెద్దమనుష్యులెవరు? వీరి విమర్శనలపస ఏమిటి? అని చూడవలసివుంది.

వీరిలో 100 కి 99 మంది జమీందార్ల ఏజంట్లు. పెద్ద భూస్వాములు. తోటల యజమానులూ అని తేలుతోంది. గ్రామాలలో వీరి ప్రభావం.వీరి దోపిడీతనం. వీరి నిరంకుశ పెత్తనం. చెప్పనక్కరలేదు. అట్టి వీంకి రైతులపక్షాన మాట్లాడటానికి, ఆక్షేపిస్తానికి. ఏమి హక్కుతాహతువుంది? వీరా రైతాంగం? వీరా రైతు ప్రతినిధులు? నాకూ స్వంత కమతం భూములున్నాయి; నేనూ రైతునేనంటూ. రైతాంగం పక్షాన రేపటినుండీ చల్లపల్లి జమీందారుబయలుదేరితే ఎంత అందంగా వుంటుంది!

విమర్శనలలో పటుత్వంలేదు

ఇక వీరి విమర్శనల సారాంశం. వాటి పటుత్వం చూడవలసివుంది.

వీరి విమర్శనా తరంగా అన్నింటినీ 4 పాయింట్లక్రింద విభజించవచ్చును.

(1) ప్రజాప్రభుత్వానికేగాని అడ్వయిజర్లకు పన్నువేసే అధికారంలేదు.

(2) ఈ పన్నువేస్తే ఒకే ఆదాయంపై రెండుసార్లు పన్ను వేయడమౌతుంది.

వ్యతిరేకుల వాదనల్లో పసలేదు

అకస్మాత్తుగా బురఖా మార్పు

(3) ఈ పన్నువల్ల కుటుంబాలు విచ్ఛిన్నమౌతాయి. ఆస్తుల పరిమాణం మరీ చిన్నవై పోతాయి.

(4)అధికాహారోత్పత్తి కుంటుపడుతుంది.

ఒక్కొక్క వాదనను పరిశీలిద్దాం.

ఈ పెద్ద మనుష్యులందరూ బిల్లు వచ్చేసరికి ఒక్కరాత్రిలో పెద్దప్రజాస్వామికవాదులైపోయారు: కాని వీరిలో అధిక సంఖ్యాకుల రాజకీయ చరిత్ర చూస్తే. రాజభక్తిపరాయణత్వమే వారిలోగోచరిస్తుందిగాని. ఏకోశానా ప్రజాస్వామిక లక్షణాలుకన్పించవు. వీరెన్నడూ అద్వైజర్ల పరిపాలననుగాని. కూర్మా వెంకటరెడ్డిగారి నడమంత్రపు మంత్రివర్గాన్నిగాని. అంతకుముందుఆర్డినెన్సుల పరిపాలననుగాని బలపర్చలేదా? ఎప్పటినుండి వీరు ప్రజాస్వామిక బురఖాను తగిలించుకున్నారు?

పోనీ.ప్రజా ప్రభుత్వంయొక్క అభ్యుదయకర చర్యలనన్నిటినీ వీరు బలపరుస్తూవచ్చారా? కాంగ్రెసు మంత్రివర్గం తెచ్చిన ఋణనివారణ చట్టం. మద్యనిషేధ చట్టం. మారుటోరియం బిల్లు మొదలైన వాటినెన్నిటిని వీరు ఎదిరించలేదు? కాబట్టి 'అడ్వయిజర్లకు పన్నువేసే హక్కులేదు. ప్రజాప్రభుత్వానికే ఆ హక్కువుంది' అంటూ ప్రజాస్వామిక బురఖాతో బిల్లును ప్రతిఘటించడమే వీరి అసలు వుద్దేశ్యం.

రంగా. ముత్తు రంగం గార్లు ఈ వాదనను మరొక వుద్దేశంతో తెస్తున్నారు. వారి ఉద్దేశంలో అద్వైజర్లు చేసే ప్రతిపనినీ - మంచిదైనా. చెడ్డదైనాసరే-వ్యతిరేకిస్తూ ప్రజలను రెచ్చగొడితే. ఈ ప్రభుత్వం కూలిపోతుంది. ఈ విధంగా అయిందానికీ, కానిదానికీ ఆందోళన చేయడమే "యుద్ధానంతర విప్లవానికి ప్రజలను తయారుచేసే" వీరి పద్ధతి: "పతితజాతుల స్వాతంత్ర్య ఫ్రంటు"ను స్థాపించే విధానంఇదే: వీరి విమర్శనవల్ల అడ్వయిజర్ల ప్రభుత్వం కూలిపోయి. ప్రజాప్రభుత్వం రాదు సరిగదా, ప్రజలకు కొద్దోగొప్పో జరిగేమంచి కాస్తా ఎగురుతుంది.

అద్వైజర్ల ప్రభుత్వంపోవాలి: అంతాతప్పక కోర్తాము. ఇది దేశ క్షేమానికి అత్యవసరం. కాని ఆ అద్వైజర్ల ప్రభుత్వాన్ని పోగొట్టి. ప్రజా ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి ఇలాంటి ప్రజానుకూల బిల్లులను వ్యతిరేకించటంకాదు. వేరే మార్గాలున్నాయి. కాంగ్రెసు - ముస్లిం లీగుల ఐక్యతపై ఆధారపడిన జాతీయైక్యతే దానికి మార్గం. భూలాభాయి - లియాఖతు గార్ల ఒడంబడిక అందుకు మార్గము. కాంగ్రెసు-లీగు పక్షాలతో కూడిన సంయుక్త మంత్రివర్గ స్థాపనకు కృషిచేయడం. దీనికై ప్రజా వుద్యమాన్ని నిర్మించడం. ఇదీ అద్వైజర్ల ప్రభుత్వాన్ని అంతంజేసేమార్గం. అసలు ఈనాడు తిరిగి కాంగ్రెసు మంత్రివర్గాలను స్థాపనచేయుటకైనా జరిగే ప్రయత్నాలకు వీరెంత వరకు తోడ్పడుతున్నారు?

రెండు పన్నులు అనే విమర్శన

ఇక వీరి రెండవ విమర్శన ఒకేభూమిపై రెండు పన్నులా? అని. ఒకేభూమిపై భూమిశిస్తూ, నీటితీర్వా చెల్లిస్తూవుండగా, మరొక పన్ను వేయటం. ఏ సూత్రం సిద్ధాంతమూ అంగీకరించదనివీరివాదన. భూమిశిస్తు పన్నా? లేక శిస్తా? అనగా - ప్రభుత్వ నిర్వహణకై వసూలు చేసేదా? లేక భూమిని అనుభవించినందుకు రైతుచెల్లించే ప్రతిఫలమా? అనేది ఇక్కడ ప్రధానంకాదు. పన్ను అనే అంగీకరిద్దాము. ఒకసారి భూమిశిస్తు చెల్లించిన పిమ్మట ఈపన్ను వేయకూడదనీ. ఇదిపన్నుల సిద్ధాంతానికి వ్యతిరేకమనీ వీరివాదన.అయితే శాస్త్రీయమగు పన్నుల సిద్ధాంతమేమిటి? చెల్లించేశక్తినిబట్టి పన్ను విధించాలి అనేది. దీనికి యీ పన్ను విరుద్ధమా? రు. 5000 లకు లోపు ఆదాయం వచ్చేవారిపై ఈ పన్ను విధించటము లేదే. విధించబడేవల్లా. జమీందార్లు. రు.5000 పైబడ్డ ఆదాయాలుగల భూస్వాములమీదనేగదా.వీరీపన్నునుచెల్లించలేరా?జమీందార్లు పేష్కసుమినహా ఒక్క దమ్మిడీకూడా ఈనాడు హెచ్చుచెల్లించలేరా? చెముడుఎస్టేటు దివాను. జమీందార్లకు వచ్చే ప్రతి రూపాయిలోనూ 0-10-6 పన్నుగా చెల్లించుకోవలసి వస్తుందనీ. తన ఖర్చులకూ, ఎస్టేటు ఖర్చులకూ 0-5-6మాత్రమే మిగులుతుందనీ వాపోయాడు: నేను సవాలు చేస్తున్నాను; ఏ జమీందారు పన్నురూపంలో అంత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తున్నాడు? అనేకమంది జమీందార్లు దుబారా ఖర్చులక్రింద పెట్టేటంత పన్నునుకూడా ప్రభుత్వానికి చెల్లించటంలేదే: పైగా యీప్రబుద్ధుడు ఈకొత్తపన్ను 0-2-6 లోనూ సగాన్ని రైతులపై తోయాలని అప్పుడే పథకం వేస్తున్నాడు:

ఒకే ఆస్తిపై రెండు పన్నులుచెల్లించటం కూడా ఇప్పుడు ఆచరణలోవున్నదే. మునిసిపాలిటీల ఉదాహరణను తీసుకోండి. ఒకనికి 10 మేడలు, కొట్లు వుండి, అద్దెకు ఇస్తూ, నెలకు రు 3000 లు ఆదాయం పొందుతూ ఉంటాడు. అతడుమునిసిపాలిటీకి ఆస్తిపన్ను చెల్లించాలి. ప్రభుత్వానికి ఆదాయపుపన్నూ చెల్లించాలి. అదేవిధంగా, ఒక వర్తకుడు వృత్తిపన్నూ చెల్లిస్తున్నాడు,ఆదాయపుపన్నూ చెల్లిస్తున్నాడు. ఇందులో లేనితప్పు వ్యవసాయాదాయం పన్నులో వచ్చిందా?

పక్షపాతంతోకూడియున్న ఇప్పటి అధర్మ భూమి శిస్తువిధానం పూర్తిగా సంస్కరించవలసిందే. రైతు సంఘాలు చిరకాలం నుండి కోరుతున్నదియిదే.దీనిని ప్రవేశపెట్టే పద్ధతులాలోచించమని కోరాలిగాని, దీనిని సంస్కరించనీయక. ప్రజోపయోగమునకై చెల్లించగల్గినవారి నుండి ఎక్కువ పన్ను వసూలు చేసే పద్ధతి వ్యతిరేకించటం భావ్యమా? పూర్తిగా నేటి భూమి శిస్తు విధానం సంస్కరింపబడేంతవరకూ పెద్ద ఆదాయాలనుండి తగినంతపన్నును వసూలు చేయుటకు ఈ మార్గంతప్ప మరొకటిలేదు. చూడవలసిందల్లా, పన్ను విధింపబడే ఆదాయం ఆ పన్నును భరించగలదా, లేదా ? ఈ దృష్టితోచూస్తే ఈపన్ను ఎవ్వరినీ బాధించదు.

కుటుంబ విచ్ఛిత్తి వాదన

ఈ పన్ను గనుక విధింపబడితే, దీని నుండి తప్పించుకోటానికి జాయింటు కుటుంబాలన్నీ ఆస్తి పంపకాలు చేసుకొంటాయనీ, అందువల్ల ఆస్తులు చిన్నవై పోతాయనీ, వీరు వాపోతున్నారు. అయితే రైతాంగంలో 100కి 95 మంది పరిస్థితులేమిటి? రు 5000 లోపు ఆదాయం వచ్చేవారు సుమారు 100 కి 95 మంది వుంటారు. వారికుటుంబాలలో విభాగాలు జరగడం లేదా? వారిఆస్తులు చిన్నవైపోవటంలేదా? ఖర్చులు కూడా గిట్టని వ్యవసాయపు ఆస్తుల పంపకం విషయంలో యీ ఉదార హృదయులెలాంటి సానుభూతి చూపుతారు? వ్యక్తిగతమైన ఆస్తివిధానం వున్నంతవరకూ ఈ విభాగాలు తప్పవు.

ఈపన్ను లేదనే అనుకుందాము. అందువల్ల పెద్ద భూస్వాములు తమ ఆస్తులను తమ సంతానానికి పంచిపెట్టకుండా అట్టిపెట్టి వుంచుతున్నారా? ఆస్తుల విభాగాలకై ఈనాడెన్నివేల దావాలు జరగటంలేదు? అవన్నీ ఉండగానే. జాయంటు కుటుంబ జీవనసౌభాగ్యానికి నేడు అంతరాయం కల్గుతుందని వీరు విమర్శన చేయుటలో అర్థంలేదు. ఈ విమర్శనచేయుట మళ్లా "ఈపన్నునుండి తప్పించుకోటానికి బినామీ ట్రాన్సుఫర్లు చేస్తాము జాగ్రత్త సుమా!" అని బెదరించటానికే.

అధికాహారోత్పత్తికి దెబ్బా?

ఈ పన్ను వల్ల అధిక పంటలు పండించాలన్న ఉత్సాహం నశిస్తుంది; అందువల్ల అధికాహారోత్పత్తి కుంటుపడుతుంది అనే వాదనకూడా వట్టివాదనే. ఈనాడు ఎంతమంది జమీందార్లు, లక్షలాది ఎకరాలు బంజర్లుగావున్న భూమిని సాగులోకి తెస్తున్నారు? ఏపన్ను పడటంవల్ల వాటిని సాగులోకి తేకుండా అధికాహారోత్పత్తికి అడ్డు పడుతున్నారు?

అదీగాక. రూపాయి ఆదాయం వస్తూంటే 0-1-0, 0-2-0 పన్ను పడుతుందని రూపాయి ఆదాయాన్ని వదులుకునే బుద్ధిహీనుడెవడన్నా వుంటాడా? ఇటువంటి విమర్శనలు వాచాలత్వం కాక మరేమిటి?

ఆదాయాన్ని యెట్లా ఉపయోగించాలి

ఈపన్నుద్వారావచ్చే ఆదాయాన్ని యుద్ధానంతరంఅభివృద్ధి స్కీములకు ఖర్చుపెట్టుటకై ప్రత్యేకిస్తున్నామని ప్రభుత్వం చెప్పింది. కాని యేఅభివృద్ధి స్కీములైనా రైతాంగంయొక్క బాగోగులమీదనే ఆధారపడివుంటుంది. ఈనాడు పారిశ్రామికంగాగాని, వైజ్ఞానికంగాగాని ముందుకు పోవాలంటే, 100 కి 80 మందిగా వున్న రైతాంగంయొక్క ఆర్థిక ప్రతిపత్తిని పెంపొందించాలి. అందులో మొట్టమొదట మెట్టు శిస్తులభారాన్ని తగ్గించడం. అందులకై ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం పక్షాన ఈ క్రింది సూచనలు చేయబడ్డాయి.

(1) ధాన్యానికి ధరలు హెచ్చాయని కారణం చూపుతూ ప్రభుత్వం రీసెటిల్మెంటు రేట్లను ప్రవేశపెట్టింది. ఈ హెచ్చుధరల లాభం బీదరైతాంగానికి ప్రయోజనకరంగాక, నష్టదాయకంగా పరిణమించిందని పైనచూపాను. కాబట్టి ఈ రీసెటిల్మెంటు రేట్లను పూర్తిగా రద్దుచేయాలి.

(2) ఇంతటితోనే బీదరైతుల ఇక్కట్లు చక్కబడవు. శిస్తు రెమిషన్లు పెద్ద, చిన్న రైతులకందరకూ ఉపకరిస్తాయి. చిన్న రైతులకు ప్రత్యేకంగా సదుపాయం కల్గించాలంటే, పూర్తిగా శిస్తులన్నీ రద్దుచేయాలి. నేటి భూమిశిస్తు విధానాన్ని పూర్తిగా సంస్కరించే లోగానే ఇదిచేయవచ్చు. రూ 10/- లు, అంతకులోపు శిస్తు చెల్లించే పట్టాదార్లు, కోళ్ళు గేదెల పెంపకమో, (మిగతా 11 పేజీలో)

బర్మాలో బ్రిటిష్ ప్రభుత్వ పన్నాగం

"బర్మాను విముక్తి పొందిన దేశంగా చూడ్డంలేదు; ఓడిపోయిన దేశంలాగా, స్వాధీనం చేసుకోబడిన దేశంలాగే చూస్తున్నారు."

— అని "హిందూ" పత్రిక(మద్రాసు)వ్యాఖ్యానించింది.

బర్మానుంచి జపాన్ సేనల్ని తరిమివేశాక అక్కడ యేర్పడబోయే పరిపాలనా విధానాన్ని గురించి బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించిన ప్లానుపై మన జాతీయవాదులంతా యించుమించు ఇలాంటి అభిప్రాయాన్నే కలిగియున్నారు.

బ్రిటిష్ ప్లానుప్రకారం మూడు దశలలో రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టబడతాయి. మొదటి దశలో బ్రిటిష్ గవర్నరు తన సొంత కార్యనిర్వాహకవర్గంయొక్క సహాయంతోపరిపాలనసాగిస్తాడు. అనగా 1919కిపూర్వం బర్మాలో యెలాంటి పరిపాలనా విధానం అమల్లో ఉండేదో, 1945 లో కూడా అలాంటిదే వస్తుందన్నమాట! రెండవదశ 1948 డిసెంబరులో ప్రారంభమవుతుంది. 1935 వ సంవత్సరపు రాజ్యాంగ చట్టంలోవున్న ప్రకారం ఎన్నికలు జరుగుతాయి. దీనిఅర్థం, యుద్ధానిక పూర్వం బర్మాలోవున్న రాజ్యాంగ వ్యవస్థ 1948 డిసెంబరులో, అనగా బ్రిటిష్ సేనలు బర్మాను తిరిగి స్వాధీనం చేసుకున్న 3½ సంవత్సరాల తరువాత, నెలకొల్పబడుతుందన్నమాట! అప్పుడు మూడవదశ ప్రారంభమవుతుంది. బర్మాప్రజల ప్రతినిధులు తమలో తాము"అవసరమైనంత" ఏకాభిప్రాయానికి వస్తే, వారొక రాజ్యాంగ చట్టాన్ని, బర్మాప్రజలకు అనుకూలంగా ఉండేదాన్ని, తయారు చెయ్యాలి. అనగా, క్రిప్సుసూచనలే బర్మాకుకూడా వర్తిస్తాయన్నమాట!

బర్మా అభివృద్ధిని అరికట్టడానికి బ్రిటిష్ప్రభుత్వం చూపుతూన్న కారణాలేమిటి? "జపాన్ దండయాత్రవల్ల బర్మా ఆర్థికంగాను, సాంఘికంగాను దెబ్బతింది. ప్రజల జీవితం మళ్లీ కుదుటబడటానికి యీదశలన్నీ గడవడం అవసరం." అని ప్రభుత్వ ప్రకటనలో ఉంది. ఈ వాదన బర్మా ప్రజల సంగతి అటుంచి. బ్రిటన్‌లోనే ప్రజాభిప్రాయాన్ని సంతృప్తిపరచలేకపోయింది. "డెయిలీవర్కర్" (బ్రిటిష్ కమ్యూనిస్టు పత్రిక) యిలా వ్యాఖ్యానించింది : "ఈ పరిస్థితులు ప్రతి యూరపు దేశంలోను లేవా? అంతమాత్రంచేత ఆయా దేశాల్లో మూడేళ్ళవరకు ఎన్నికలు జరక్కుండా ఆగిపోపోయాయా?" అని ప్రశ్నించింది. "డెయిలీహెరాల్డు" (లేబరుపార్టీ పత్రిక) యిలా రాసింది : "బర్మా మాదిరిగానే ఫిలిప్పైన్‌దీవులు జపాన్ దాడివల్ల దెబ్బతిన్నాయి. అయినప్పటికీ ఫిలిప్పైన్ ప్రజలకు అమెరికా స్వాతంత్ర్యం యివ్వలేదా?"

అసలు విషయం ఏమంటే, బర్మాపట్ల బ్రిటిష్ టోరీ సామ్రాజ్యవాదులు యుద్ధకాలంలో ఏ నీతిని అవలంబించారో శాంతి రోజుల్లోకూడా అదే నీతిని అవలంబించ దలచుకున్నారు. యుద్ధం జరుగుతూన్నంతకాలం సామ్రాజ్యవాదులు బర్మా ప్రజల సహకారాన్ని నిరాకరించారు. ఎందుకంటే, బర్మాలో బ్రిటిష్ సేనల ఏకచ్ఛత్రాధిపత్యం ఉండాలని వారి కోరిక. శాంతిరోజుల్లోకూడా ప్రజా సహకారంతో నిమిత్తంలేకుండా, బ్రిటిష్గుత్తవ్యాపారస్తుల పెత్తనం నిర్విఘ్నంగా సాగిపోవాలని వారి వాంఛ. ఈవిధంగా టోరీ సామ్రాజ్యవాదులకు కావలసిందిబర్మాప్రజల అభివృద్ధికాదు-తమ వ్యాపారానికి యెక్కువ అవకాశాలు!

ఇప్పటికే బర్మాలో పరిస్థితులు బెంగాల్‌లో మాదిరిగా అధ్వాన్నమవుతున్నాయి. 14 వ బ్రిటిష్‌సేన మలయా, సయాంల మీదికి వెళ్తూన్న యీ రోజుల్లో యుద్ధరంగాలకు వెనుకభాగాన ప్రజలు సహకారం చేయకపోతే ఏది యెలా జరుగుతుందో చెప్పలేం. అందువల్ల బ్రిటిష్ప్రజలు యీ కొత్త రాజ్యాంగ సంస్కరణలపట్ల తమ వ్యతిరేకభావాన్ని యింకా తీవ్రంగా ప్రకటించకమానరు.

బర్మా ప్రజలమీదకూడా ఎంతో బాధ్యతవుంది. బర్మాలో యీరోజున వివిధ జాతీయపక్షాలుకలిసిఉన్న "పేట్రియాటిక్ ఫ్రంట్" వుంది. అందులో 50 వేలమంది సభ్యులున్నారు. వీరిలో సంస్కరణవాదులు, జపాన్‌తో చేతులుకలపడంవల్ల జరిగిన మోసాన్ని తెలుసుకున్న తకీన్ పక్షంవారు, కమ్యూనిస్టులు ఉన్నారు. వీరంతా సంఘీభావంతో బర్మా ప్రజల మధ్య స్వాతంత్ర్య ప్రబోధంచేస్తూ, ప్రజా ప్రతినిధిపరిషత్తు, (కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ) కొరకు ఆందోళనగావిస్తూ ప్రజలమనోనిబ్బరాన్ని కాపాడినట్లయితే, బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల ప్లాను భగ్నమవుతుంది.

ఈ సంస్కరణలను మన జాతీయపత్రికలన్నీ తీవ్రంగా విమర్శించినమాట నిజమే. సామ్రాజ్యవాదుల పన్నాగాన్ని బయటపెట్టిన సంగతి యాదార్థమే. కాని, ప్రభుత్వంయొక్క కర్తవ్యం ఏమో ఏపత్రికా సూచించలేదు. వివిధరాజకీయ పక్షాలు కలిసిఉన్న "పేట్రియాటిక్ ఫ్రంట్" నాయకులతో ప్రభుత్వం సంప్రతింపులు జరపాలని మన దేశంలోకూడా ఆందోళన చేయవలసియుంది. ఇండియాలో వెల్లివిరిసిన జాతీయోద్యమ ప్రభావంవల్లనే, ముఖ్యంగా బర్మాకు 1919 లోను, 1935 లోను, ఆపాటి సంస్కరణలైనా వచ్చాయి. ఇప్పుడు మన జాతీయోద్యమం దారి - తెన్ను గానక ఊబిలోదిగబడి ఉండడంవల్లనే, బర్మాలో సామ్రాజ్యవాదులు ఈ విధంగా తమయిష్టంవచ్చిన ఆటలు ఆడగల్గుతున్నారు. ఇండియాకు స్వాతంత్ర్యంవస్తే, బ్రిటిష్ వలసదేశంగా ఉండు బర్మా మనకెంత హానికరంగా పరిణమిస్తుందో గుర్తించడం అవసరంకాబట్టి, బర్మా "పేట్రియాటిక్ ఫ్రంట్"నాయకులతో బ్రిటిషుప్రభుత్వం సంప్రదింపులు ప్రారంభించవలసిందిగా మనదేశంలో ఆందోళన చేయవలసియుంది.

— 'పీపుల్స్‌వార్' నుండి

కామ్రేడ్ సుందరయ్యకు జామీను ఇవ్వలేదు

కామ్రేడ్ సుందరయ్యకు జామీను యివ్వవలసిందని బందరులో సబ్ మేజిస్ట్రేటు యెదుట మొన్న 15 వ తేదీని పిటిషన్ పెట్టారు. ఆ పిటిషన్ 25 వ తేదీని విచారణకు వచ్చింది. జామీను యివ్వకూడదంటూ పోలీసువారీ దిగువ కారణాలు చెప్పారు:

1. రిమాండుకాలంలో జామీనివ్వడానికి సబ్‌మేజస్ట్రేటుకి అధికారం లేదు.

2. జామీనిచ్చినట్లయితే సుందరయ్య ఎటోపోయి దాక్కుంటాడు. తిరిగి కోర్టుకి హాజరుకాడు. పార్టీ రహస్యంగా ఉన్నరోజుల్లో యెంతకాలం ప్రయత్నించినా సుందరయ్యను పట్టుకోలేకపోయాం.

వీరి వాదనను పాటించి సబ్‌మేజస్ట్రేటు జామీను నిరాకరించాడు.

దానిపై ఏలూరులో సెలవుల్లో పనిచేసే జిల్లాకోర్టు యెదుట అప్పీలు పెట్టారు. కాని అక్కడ జడ్జి లేకపోవడంవల్ల మద్రాసు హైకోర్టులో జామీనుకి అప్పీలు చేయడానికి నిశ్చయించారు.

సంపాదకీయం

బ్రిటన్‌లో ఎన్నికలు

చర్చిల్ రాజీనామా నిచ్చాడు. తాత్కాలికంగా మాత్రమే ఇప్పుడధికారంలో ఉన్నాడు. యుద్ధకాలంలో ఎలాగో ఒకలాగు అతనితో గడుపుకొచ్చారు, బ్రిటిష్ప్రజలు. ఇక బ్రిటిష్ వ్యవహారాలను అతని చేతిలో ఉంచితే దేశానికి అనర్థదాయకము: అంతర్జాతీయ శాంతికి కూడా భంగకరమని లేబరు పార్టీ గుర్తించింది. అతను రాజీనామానిచ్చేలా చేసింది. కాని, చర్చిల్ తిరిగి అధికారంలోకి రావాలని ఆశిస్తున్నాడు. నిన్న మొన్ననే, తన హయాములో బ్రిటన్ అఖండ విజయం సాధించింది. ఆ విజయోత్సాహం, ఆ ఆవేశం ఇంకా చల్లారలేదు. ఈ అదనుపోతే ఇక తనకు అవకాశం దొరకదని చర్చిల్ ఎరుగును. అందుకనే పార్లమెంటునుకూడా ఇప్పుడే రద్దుచేయించి, జులై 5వ తేదీనే తిరిగి ఎన్నికలు జరపాలని ప్రకటించాడు. అక్టోబరు వరకు ఎన్నికలు ఆపమని లేబరు పార్టీ కోరింది. తమరక్తాన్ని ఓడ్చి యుద్ధరంగంలో విజయం సాధించిన సైనికులకు, యుద్ధరంగంలో అష్టకష్టాలకోర్చి సేవచేసిన వీరనారీమణులకు కూడా ఎన్నికల్లో పాల్గొనడానికి అప్పుడే అవకాశం ఉంటుందని చెప్పింది. లోగడ ఒకమారు వీరి విషయం మాట్లాడుతూ, "దేశంలో వోటుచేయవలసిన హక్కు తక్కిన వారందరికన్నా వీరికే ఎక్కువ ఉండాలని నేనంటాను"అని చర్చిలేపలికాడు. కాని, ఇప్పుడామాటలు మరచిపోయాడు, వాళ్లు తిరిగివచ్చేవరకు ఆగుతే తాను నెగ్గే అవకాశం అంతరించిపోతుందేమో అని భయం. పైగా తన పరిపాలన ఫలితాలను ఆయాదేశాల్లో కళ్ళార చూచివచ్చిన ఆ సైనికులు ఎటువోటుచేస్తారోఅని అనుమానం. చర్చిల్‌కీనాడు తన ప్రజలయందు, తన సైనికులయందు నమ్మకంలేదు. అందువల్లనే, తానంటే ప్రస్తుతం ఉన్న అభిమానం చల్లారకముందే వోట్లుసంపాదించాలని అతని ఎత్తుగడ. ఈపన్నాగం విఫలంకాకతప్పదు. లేబరుపార్టీ ఇతనిసవాలునంగీకరించింది. ఎన్నికలలో కుదురుకుపోంది. లేబరుపార్టీతోపాటు కమ్యూనిస్టు పార్టీ - లిబరల్‌పార్టీ మొదలయిన అభివృద్ధికరపక్షాలన్నీ ఈ ఎన్నికల్లో పాల్గొంటున్నాయి. కమ్యూనిస్టుపార్టీ తరపున కామ్రేడ్ రజనీపామీదత్తు అమెరీపై పోటీగానిల్చుంటున్నాడు.

ఈ ఎన్నికల ప్రాముఖ్యతేమిటి? భారతదేశాన్నిపట్టి పీడిస్తున్న కన్సర్వేటివుపార్టీ, 25 ఏళ్ళపాటు సోవియట్‌ని అంటరానిదానిగా చూచి, యూరప్ రాజకీయాలను అల్లకల్లోలం చేసిన కన్సర్వేటివ్‌పార్టీ ఓడిపోతుంది. మొదటినుంచీ సోవియట్‌తో సహకారంకోసం, ఫాసిజాన్ని నాశనం చేయడం కోసం, భారత స్వాతంత్ర్యం కోసం ఆందోళన చేసిన లేబరుపార్టీ, కమ్యూనిస్టుపార్టీ మొదలైన అభివృద్ధికరశక్తులు నెగ్గుతాయి. ఇలాంటి అభివృద్ధికర, ప్రజాస్వామిక శక్తులపైని ఆధారపడిన మంత్రులు అధికారంలోకి వస్తారు. ఇంత చరిత్రాత్మకమైన ఎన్నికల సందర్భంలో లేబరుపార్టీ ఇతర అభివృద్ధికర పక్షాలతో ఐక్యత కుదుర్చుకొని ఉంటే, ఎన్నికలలో వీటిబలం ఇంకా ఎక్కువగా ఉండేది. కాని లేబరుపార్టీనాయకత్వం తన సంకుచితత్వాన్ని ఇంకా వదలలేదు.

అంతేకాదు. ఇండియా విషయంలో మొన్నటి లేబరుపార్టీ సమావేశం తన వైఖరిని ఇదమిద్ధమని తేల్చవేదు. లేబరుపార్టీ అధికారంలోకివస్తే ఇండియా కార్యాలయాన్ని రద్దుచేసి, డొమినియన్‌శాఖతో చేర్చేస్తామనీ, ఏటేటా ఇండియా ప్రభుత్వానికి యెక్కువ అధికారాలను ఒప్పచెబుతామనీ ఎర్నెస్టుబెవిన్ అన్నాడు. ఇండియాకు సంపూర్ణస్వాతంత్ర్యం యివ్వాలని విరుడుజరిగిన లేబరుపార్టీ సమావేశంలో నాయకత్వాన్ని ధిక్కరించి ప్రతినిధులు తీర్మానంచేశారు. ఈనాడు బెవిన్ అన్నమాటలకు, ఆ తీర్మానానికి హస్తిమశకాంతరం వుంది. దీనిపై ప్రతినిధుల్లో తీవ్రమైన అసంతృప్తి ప్రబలింది. బెవిన్ వెలిబుచ్చిన అభిప్రాయం అతని వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని లాస్కీ మొదలైనవారు ప్రకటించారు. అయితే ఇండియామీద లేబరుపార్టీచేసిన తీర్మానమేమిటి? "ఇండియాకు, ఇతర పీడిత ప్రజలకు బేషరతుగా స్వాతంత్ర్యం యివ్వాలని" సూచించిన తీర్మానాన్ని వోటుకు తేకుండా బుట్టదాఖలుచేశారు. దీనినిబట్టి లేబరుపార్టీ ప్రస్తుత నాయకత్వానికి, ప్రతినిధివర్గానికివున్న తేడా స్పష్టమవుతుంది. ప్రతినిధుల అభిప్రాయాలను ఈనాయ (మిగతా 2వ కాలం)

కులు పెడచెవిని పెట్టలేరు. అంతేకాకుండా రేపు రాబోయే పార్లమెంటులో ప్రజాస్వామిక పక్షాల ప్రాబల్యం హెచ్చుగా వుంటుంది. యూరపులో సోవియట్‌తో భుజం భుజం కలిపి, అభివృద్ధికర విధానాన్ని అవలంబిస్తామని లేబరుపార్టీ సమావేశం ప్రకటించింది. దానితోపాటు ఇండియా విషయంలో కూడా అభివృద్ధికర పంథా ననుసరించి, స్వాతంత్ర్యాన్ని గుర్తించక తప్పదు.

భారతనాయకులకు ఇది అపూర్వ అవకాశం. ఆ ఎన్నికలతో మనకు పనిలేదనుకోవడం కూపస్థమండూక విధానం. మనకు కూడా ఇది చాలప్రధానమయినదే. ప్రధాన రాజకీయ పార్టీ లేకముఖంగా నిలబడి స్వాతంత్ర్యాన్ని కోరిన యెడల లేబరు పార్టీ నాయకులు దానిని పెడచెవిని పెట్టజాలరు. లేబరుపార్టీ సభ్యులు, ఇతర అభివృద్ధికర పక్షాలు మనతో చేతులుకలిపి రేపు రాబోయే మంత్రివర్గం మన స్వాతంత్ర్యాన్ని అంగీకరించేలా చేయగలం. జాతీయనాయకులీ అవకాశాన్ని జారవిడువకుందురు గాక.

ఫోర్జరీ ఉత్తరాలకు ప్రోద్బల మెవరు?

బొంబాయిలో "మాతృభూమి" అనే గుజరాతీ దినపత్రిక ఒకటుంది. దీనికి యజమాని చిమన్‌లాల్ వడీలాల్ షా. ఇతగాడు వాయిదాబేరాల్లో మొనగాడని ప్రతీతి. దొంగ మార్కెట్లో న్యూస్‌ప్రింటు కాగితం అమ్మి, చాలాధనం ఆర్జించాడని పేరు.

ఈ నెల 8వ తేదీని చిమన్‌లాల్ వడీలాల్‌షా తన పత్రికలో జిన్నా - అమెరీల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలంటూ ఒక శీర్షికపెట్టి, మొదటి ఉత్తరం ప్రచురించాడు. వచ్చే సంచికల్లో వరసగా మిగతా ఉత్తరాలు కూడా ప్రచురించబడతాయని రాశాడు. రోజుకి ఒక ఉత్తరం మాత్రమే ప్రచురించసాగాడు. దానితో అతని పత్రిక ఒక్కొక్క ప్రతి రెండేసి రూపాయలు కూడా అమ్మింది. పాఠకులు విరగబడి కొనుక్కున్నారు. పత్రిక అమ్మకం ఒక్కరోజులో రెట్టింపు పెరిగింది. ఈ ఉత్తరాలన్నీ కల్పితకథ అని జిన్నా పత్రికల్లో ప్రకటించాడు. కాని, చిమన్‌లాల్, అమెరీ సంతకంతోఉన్న ఒరిజినల్ ఉత్తరం అంటూ ఫొటో ఒకటి అచ్చువేశాడు. పత్రిక అమ్మకాలు మరింతపెరిగాయి. పాఠకులు మరింత కుతూహలంతో ప్రతులు కొన్నారు.

ఈ లేఖల్లో కల్పించిన విషయాలేమిటి? 1944, జులై 24 వ తేదీన జిన్నా అమెరీకి తాను నిజంగా గాంధీజీతో మాట్లాడడానికి యిష్టం లేనట్లూ, అయినా తనకోసం గాంధీజీ పన్నుతూన్న "వల" యెలాంటిదో తెలుసుకునేందుకు వెళ్ళబోతున్నట్లూ, ముస్లింలమీద కాంగ్రెసుకి యెలాంటి పలుకుబడి లేనట్లూ, తనకే ఉన్నట్లూ - తెలియజేశాట్ట! దీనికి జవాబుగా అమెరీ, జిన్నా లేఖకు సంతోషం వెలిబుచ్చాట్ట! జిన్నాకోరే పాకిస్తాన్ కోర్కెను గాంధీజీ ఎట్టిషరతులు లేకుండా అంగీకరించేటట్టు ఉన్నాడనీ, అలా అంగీకరిస్తే పరిస్థితులు మరోరూపం దాల్చుతాయనీ అమెరీ అన్నాడట!

ఈ వుత్తరాల్లో వాడినభాష, శబ్దాలకూర్పు, నుడికారం - జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, జిన్నాగాని - అమెరీగాని అవి రాసివుండరని స్పష్టంగా గ్రహించవచ్చు. అంతేగాదు, ఈ వుత్తరాలు సృష్టించిన దొంగకు టైపుచేయడం సరిగా చేతగాదు. మరొకని చేత టైపుచేయించడాని కనుమానం! అందువల్ల స్వయంగా టైపుచేయడంలో ఎన్నో అక్షరాల తప్పులు, హంపసాదులు, కొట్టివేతలు - వచ్చాయి. కొత్తపేరా ప్రారంభించేటప్పుడు ఎంత స్థలం విడిచిపెట్టాలో, పంక్తి చివరమాట పెద్దదైతే దాన్ని రెండుగా చేయడమెలాగో, మొదలైన సంగతులీ పీచునకు తెలియవు. ఓం ప్రథమం అంటూ, ఉత్తరం ప్రారంభంలోనే ఒక తారీఖువేసి, దాన్ని కలంతో కొట్టివేసి, మరో కొత్త తారీకువేసే దద్దమ్మ ఎవడైనా వుంటాడా? ఇలాంటి తప్పులతో కాగితం టైపుచేస్తే, పెద్దపెద్ద కంపెనీ కార్యాలయాలలోనే ఊరుకోరే! చాలమంది నిపుణులు పనిచేస్తున్న ఇండియా ఆఫీసులో యిలాంటి టైపిస్టు లుంటారంటే, నమ్మదగిన విషయమేనా?

అంతేకాదు, అమెరీ అసలు సంతకానికీ, దొంగసంతకానికీ తేడా ఎంతోవుంది. ఈవ్యాసం చివర ఎడమువైపున అమెరీ అసలు సంతకంవుంది. అది, ఒక ఉన్నద్యోగికి అధికార రీత్యా వచ్చిన సనదు. కుడిచేతివైపున ఉన్నది ఫోర్జరీ సంతకం. రెండింటికీ ఎంత తేడావుందో చూడండి!

ఈ జాబులు సృష్టించిన దొంగపేరు రామచంద్రన్ నాయర్. వీడు "సండే స్టాండర్డు" పత్రికా కార్యాలయం (బొంబాయి)లో విలేఖరిగా పనిచేస్తూ వుంటాడు. గాంధీ - జిన్నాలిద్దరూ సంప్రతింపులు సాగిస్తూన్న రోజుల్లో వారిద్దరిమధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలను దొంగిలించి, "జన్మభూమి" పత్రికా సంపాదకుడైన అమృతలాల్ సేఠ్‌కి అమ్మిన ప్రబుద్ధుడు వీడే! దాదాపు నెల రోజులక్రితం ఈ నాయరు ఒక కథ అల్లాడు. గాంధీజీ భులాభాయిదేశాయికొక ఉత్తరం రాశాడట! అందులో, రాజీప్రయత్నాలిక మానవలసిందని సలహా యిచ్చాడట! కారణం, రాజీ కుదిరినప్పటికీ, కాంగ్రెసు అందుకంగీకరించదట! కుదరకపోతే, భులాభాయి నవ్వులపాలౌతాడట! ఈ కథను "సండే స్టాండర్డు" పత్రిక, "ఎసోసియేటెడ్‌ప్రెస్" సర్వీసు, కూడా ప్రకటించాయి. గాంధీజీ, యీవార్త నిజంకాదని స్పష్టంగా ప్రకటన చేశాడు.

చిమన్‌లాల్ వడీలాల్‌షా రామచంద్రన్ నాయరుకి సొమ్ము మస్తుగా యిచ్చాడు. తనూ సంపాదించాడుగా! ఉత్తరాలు కల్పితకథలని జిన్నా ప్రకటించినతరువాతకూడా వాయిదాబేరగాళ్లకుండేదీమాతో, వడీలాల్‌షా అసలు ఉత్తరాన్ని అమెరీ సంతకంతోసహా ప్రచురిస్తున్నానంటూ, ఫోర్జరీ సంతకంగల ఉత్తరాన్ని ప్రకటించాడు.


ప్రపంచాన్ని మోసపుచ్చడానికి యింతకంటె తుచ్ఛమైన పద్ధతి మరొకటిఉండబోదు.


జిన్నా ప్రకటన యితగాడికి సంతృప్తి కలిగించలేదు. అమెరీ, యీ ఉత్తరాలు నిజమైనవి కావని ప్రకటించేసరికి, వెంటనే కాళ్ళబేరానికివచ్చి క్షమాపణ వేడుకున్నాడు! జిన్నా మాటలో నమ్మకం లేని వీనికి అమెరీ మాట వేదాక్షరం అయింది!

జిన్నా ప్రకటన పత్రికల్లో వచ్చాక కూడా వివిధ రాష్ట్రాలలో జాతీయపత్రికలు జిన్నా - అమెరీ లేఖలు నిజమేనని నమ్మి, ముస్లింలీగ్‌మీద - జిన్నామీద దండయాత్రచేశాయి. ఒక్క రాజాజీతప్ప మిగతా నాయకులెవరూ యీ దొంగ ఉత్తరాలను ఖండించకపోవడం (జిన్నా ప్రకటన వచ్చాకకూడా) విచారకరం.

హిందూ - ముస్లిం విభేదాలను ఆధారంగా తీసుకొని, బ్రిటిష్ పాలకవర్గం అధికారాన్ని భారతీయులకీయకుండా విర్రవీగుసుకు కూచోడానికి 'మాతృభూమి' సంపాదకుడు సహాయం చేయడం లేదా?

— పీపుల్స్‌వార్ నుండి




Would you, for instance, interim arrangements as the [illegible]ces, leaving aside the ques- [illegible]autonomy to Muslim provinces [illegible] move after peace is
Yours sincerely,

చిట్టి, గణపతిరావుగార్ల అఘాయిత్యాలు

బెజవాడ దెబ్బలాటకు కారణం

బెజవాడలో దాదాపు 1500 మంది నగర కులస్తులున్నారు. ఏ కొద్దిమందో ధనికులు తప్ప, మిగిలినవారికంతా ముఠాపని, ఇండ్లు తోలుట వగైరా పనులే. ఈకులంలో బీదవారు ఎక్కువగా ఉండుట, విద్యాధికులు బహుకొద్దిగా ఉండుట వల్ల కులాన్నంతా ఏ యిద్దరు ముగ్గురు వ్యక్తులో నయాన భయాన కంట్రోలు చేస్తున్నారు. యిలాంటి వ్యక్తులలో మరువిశ్ళ చిట్టిగారొకరు. వీరు కులాన్నంతా తన స్వార్థంకొరకు ఉపయోగించుకుండేవారు. ఎన్నో సంసారాలను పాడుచేసి భయపెట్టటమే ప్రధాన ఆయుధంగా పెట్టుకొని నగర కులస్తులపై పరిపాలన సాగించాడు. వీరికులంలో "ముద్ర" అనే ఆచారం ఉంది. ఏయింటిలో ఏశుభకార్యం జరిగినా, వారు ఆహ్వానించ దలచిన బంధువులపేర్లు జాబితా వ్రాసి చిట్టిగారికి పంపితే, వారు తమ కిష్టంలేనివారి పేర్లు కొట్టివేసి, మిగతావాటిపై సీలు (ముద్ర) వేస్తారు. తమ ముఖ్యబంధువులైనా, నేరం లేకపోయినా, చిట్టిగారు కొట్టివేస్తే, వారిని పిలువకూడదు. ఒకవేళ ధైర్యం చేసి పిలిస్తే, యీ కుటుంబీకుని గూడ వెలివేస్తారు. చూడండి, ఎంత నిరంకుశత్వమో! దీనికి గురియై ఎన్నో కుటుంబాలు బాధలు పడుతున్నాయి.

నగరాకులస్తులకు దేవాలయం, దానికి సంబంధించిన కొంతఆస్తివుంది. దీనిమీద పెత్తనం చిట్టిగారిదే. దీని ఆదాయవ్యయాలు వీరి స్వంతవ్యవహారం అనుకున్నారు. కొన్ని ఏండ్లనుండి వచ్చే ఆదాయానికి జమాఖర్చులు చెప్పక, దుర్వినియోగం చేశారు. లెక్క చెప్పండి అని అడిగితే, నాడిపని అఖరే! అందువల్ల జడిసి వూరుకునేవారు.

పట్టణంలో ప్రధాన కాంగ్రెసువాదులయిన యీ చిట్టి, గణపతిరావుగార్లు, తమ పలుకుబడిలోవున్న కొంతమంది మద్దతుతో యీ పరిపాలన సాగిస్తుంటే, నగరాలలోనే దీని నెదుర్కొవాలని వాంఛ కలిగింది. కులంలో వున్న రెండు పార్టీలను, కలపాలని, ఆస్తికి జమాఖర్చులు ప్రతిసంవత్సరం ప్రకటించాలని, అందరూ కలిసి కులపెద్దలను న్యాయసమ్మతంగా ఎన్నుకోవాలని, అట్టికుల పెద్దలు కులకట్టుబాట్లను నిర్ణయించి అమలుపరచాలని, ముద్రఅధికారం వారికే వుండాలని (అవసరమని వారు తలిస్తే), కులంలోని బాలబాలికలకు, యువకులకు అవసరమైన విద్యాసౌకర్యాలు కలిగించాలని, వైద్యసౌకర్యాలు ఏర్పరచాలని — ఒక ఉద్యమం బయలుదేరింది. ఇదే "నగరాల ఐక్యతాకృషికమిటీ" దీనిలో అభ్యుదయ భావాలు గల యువకులే గాక, చాలమంది పెద్దలు కూడ వుండి పని చేస్తున్నారు.

కమ్యూనిస్టుపార్టీలో చాలమంది యీ నగర యువకుల ఐక్యతా వుద్యమంలో అందరితో పాటు చాల శ్రద్ధతీసికొని పనిచేస్తున్నారు.

ఈవిధంగా కులంలో ఐకమత్యం ఏర్పడి ఎన్నికలు జరిగి, ఐక్యతాకమిటీ యేర్పడితే, యీనాడు చిట్టి, గణపతిరావుగార్లు సాగించే నిరంకుశ పరిపాలనకు తావుండదు. ఆదాయాలను దుర్వినియోగం చేయటానికి వీలులేదు. అదీగాక, తమకు ఎన్నడోసహచరులుగావున్న అనేకమంది పెద్దలు, యువకులు తమకు వ్యతిరేకులైనారని గ్రహించారు. యువకులలో అధికభాగం మా పార్టీలో వున్నారు. తమకులంలో తమ పలుకుబడి సన్నగిలుటయేగాదు; తమ అనుచరులంతా ఐక్యతాకృషి కమిటీలో వుండి, కులానికి ప్రయోజనకరమైన సూచనలను బలపరుస్తూ, తమ పెత్తనానికే ముప్పుతెచ్చారు. దీనికంతా మా పార్టీయే కారణం అని పార్టీపై శతృత్వం పూనారు.

ఇవీ మాకూ, చిట్టి, గణపతిరావుగార్లకూ గల విభేదాలు.

పగ సాధించటానికి వారి కుట్ర

ఈ సంవత్సరంలో గత రెండునెలలలోను ముద్ర లేకుండానే అనేకమంది పెండ్లిండ్లు చేశారు. ఈ పెండ్లిండ్లకు చిట్టి, గణపతిరావు, వారి అనుచరులు తప్ప తక్కినవారంతా వచ్చారు. అందువలననే చిట్టి, గణపతిరావుగార్లు తమ నిరంకుశత్వాన్ని నగరాలు యెదిరించినట్లు గ్రహించి, తగాదాలకు దారితీశారు.

కమ్యూనిస్టులను, అందులోను మా పార్టీ సెక్రటరీ పోతరాజును హతమారిస్తే, తమ పలుకుబడిని నిలబెట్టుకోగలమని భ్రమించారు. అందుకే కొంతమంది రౌడీలను, త్రాగుబోతులను, కూడదీశారు. ఒంటరిగాపోవు మా పార్టీ సభ్యులను రెచ్చగొట్టి, కొట్టటం, దూషించటం ప్రారంభించారు. పోయిన దసరానుండి యీ ఘటనలు ఎక్కువైనాయి. దసరాలో మేము ప్రజల నిత్యసమస్యలమీద, ఫాసిస్టు ప్రమాదాన్ని గురించి, ప్రదర్శనలు గావించాం. దాదాపు 50 వేలమంది ప్రజలు ఈ ప్రదర్శనలను చూచి ఆనందించారు. అసూయపడి (మిగతా 8 పేజీలో)

'ప్రజాశక్తి' దినపత్రికకు ఇదిగో మావంతు!

"ప్రజాశక్తిని దినపత్రికగానడపడానికి అనుమతి వచ్చిందా? ఎన్నిరోజులలో ప్రారంభిస్తారు?" అంటూ చేరారు నాచుట్టూ. నేను బెజవాడనుంచి వెళ్ళానేమో, నాకు విషయాలన్నీ తెలిసివుంటాయని అభిప్రాయపడ్డారు. "ప్రయత్నాలు చేస్తున్నాం. తప్పకుండా అనుమతిస్తారని నమ్మకం వుంది. కాని ఒక విషయం గుర్తుంచుకోండి. మనం, మన ప్రజలే ఏది రావడానికైనా గ్యారంటీ,"అని చెప్పి మీ తాలూకాలో డబ్బు ఎంత వసూలుచేస్తారని అడిగా. మాకోటా ఎంతేమిటని ఒకాయన అడిగాడు. గన్నవరం, దివితాలూకాలకన్నా తక్కువే - 40 వేలు. 'ఓతప్పకుండా వసూలు చేస్తామ'న్నాడు ఒక అర్గనైజరు. అంతతేలిక కాదు - 40 వేలు వసూలు చేయడానికి చాల కష్టపడాలి, అని మరొకాయన అన్నాడు. ఇదంతా కొద్దిసేపటిలో గుడివాడ తాలూకా జనరల్‌బాడీ మీటింగు చౌటపల్లిలో ప్రారంభమవుతుందనగా పాతస్నేహితులతో జరిపిన పిచ్చాపాటి.

చంద్రం ఉపన్యాసం

జనరల్‌బాడీ సమావేశం ప్రారంభమయింది. 200మంది సభ్యులు, సానుభూతిపరులు సమావేశమయారు. మద్దుకూరి చంద్రశేఖరరావుగారు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై ఉపన్యసించారు. "ఈ యుగపు హిరణ్యాక్ష, హిరణ్యకశ్యపులైన హిట్లరు ముసోలినీలు పతనం చెందారు. అందులో ఒకడైన ముసోలినీ మిలాన్ నగరవీధులలో దేశభక్తులచే చంపబడ్డాడు. తమ బిడ్డలెందరినో పొట్టబెట్టుకున్న ఆ రాక్షసుని శవాన్ని చూడ్డానికి ప్రజలు తండోపతండాలుగా తరలారు. ఒకతల్లి ముసోలినీశవాన్ని చూడగానే, వాడివాతబడ్డ తన ఐదుగురు కొడుకులను గుర్తుకు తెచ్చుకొని, వాడిపై ఐదుగుండ్లు పేల్చింది. ఇది యూరప్‌లో ప్రజా చైతన్యానికి, ఫాసిస్టువ్యతిరేకతకు ఒకగుర్తుమాత్రమే. ఈవిధంగానే యూరప్ అంతటా ప్రజా వుద్యమాలు వెల్లివిరిసి, ఫాసిజాన్ని పటాపంచలు చేస్తున్నాయి. ప్రజా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. కాని ఇంతటి మార్పును, ఇంతటి ప్రజా ఉద్వేగాన్ని మనదేశ పత్రికలు ప్రతిబింబించుతున్నాయా అంటే, లేదు. పైగా ముసోలినీకి జరిగిన శాస్తిని పశుతుల్యమని, దుర్మార్గమని నిందించుతున్నాయి. ఈహిరణ్యాక్ష, హిరణ్యకశ్యపులు చేసిన అంతులేని అత్యాచారాలను ప్రజలకుచూపెట్టి, అటువంటి దుర్మార్గులనలాగే నాశనం చేయాలని ప్రబోధించుటకు బదులు, ముసోలినీప్రేమ, హిట్లర్ బ్రహ్మచర్య ఔన్నత్యాన్ని గురించి పొగడుతున్నాయి.

"ఇదేవిధంగా మన రాష్ట్రంలో జరిగే అనేక సంఘటనలకు వక్రభాష్యం చేస్తున్నాయి. కాశేశ్వరరావు, రంగాలు కమ్యూనిస్టుపార్టీపై దుష్ప్రచారం చేస్తూంటే, ఆంధ్రస్త్రీలకు వ్యభిచారం అంటకడుతూంటే, వారి చర్యలను ఖండించుటకు బదులు వారిని కమ్యూనిస్టు వ్యతిరేక శిఖామణులుగాను, జాతీయోద్యమ ఉద్ధారకులకుగాను చిత్రించుచున్నాయి. కమ్యూనిస్టులపై రౌడీలు దుష్ప్రచారం చేస్తూంటే, వారికి తగినశాస్తి జరిపితే 'అమ్మో కాంగ్రెసు వారిని కొట్టార'ని పెద్ద శీర్షికలతో తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే - నీచమైనవానిని ఉత్కృష్టంగాను, ఉత్కృష్టమైనవానిని నీచంగాను చిత్రించుచున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మనకు దినపత్రిక ఎంతో అవసరం. ప్రజలకు నిజానిజాలను తెలియజెప్పాలి. ప్రజావుద్యమాన్ని చిత్రించాలి. నూతనంగా ఆంధ్రలో గల్గిన ప్రజావుద్యమవ్యాప్తిని ప్రతిబింబించాలి. భారతస్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనుటకు ఆంధ్ర ప్రజల నందరిని ఐక్యపర్చాలి. ఈ ఆశయాలతోనే మనం దినపత్రికకు ప్రయత్నం చేస్తున్నాం. పత్రిక నడపడానికి కనీసం 5 లక్షల రూపాయలు కావాలి. ఇది మీ దేశభక్తికి, త్యాగానికి పరీక్షసమయం. మీ శక్తికొలది విరాళాలివ్వండి", అని కామ్రేడ్ చంద్రం తన ఉపన్యాసాన్ని ముగించారు.

జొన్నపాడు ఆదర్శం

ఒక్క నిమిషంపాటు అంతా నిశ్శబ్దం. ఎవరు యెంత యిస్తారో అని అంతా ఎదురు చూస్తున్నారు. ఇంతలో కామ్రేడ్ రంగారెడ్డి లేచి వెయ్యి రూపాయలన్నాడు. కామ్రేడ్ రంగారెడ్డి 1930 సత్యాగ్రహంలో జైలుకు వెళ్ళాడు. తరువాత కమ్యూనిస్టుపార్టీ ఆయనను ఆకర్షించింది. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ పుట్టినప్పటినుంచీ కృషిచేస్తున్న వ్యక్తి. ఇదివరకు తాలూకా కాంగ్రెసుఅధ్యక్షుడు గాపనిచేశాడు. ఈనాడుతాలూకా రైతుసంఘ అధ్యక్షుడు. వీరిగ్రామమేజొన్నపాడు (నందివాడఫిర్కా) వెంటనే జొన్నపాడు కామ్రేడ్సు ఒకరి తరువాత ఒకరు లేచారు. కామ్రేడ్ మలిరెడ్లి వీరరాఘవయ్య రు. 1000 లు, కామ్రేడ్ వెంకటరంగయ్య రు. 1000 లు, సీతారామ కోటిరెడ్డి రు. 500 లు, షణ్ముఖంరెడ్డి 400, వరుసనే చెప్పారు. మిగిలిన జొన్నపాడు కామ్రేడ్సంతా తమ శక్తికొలది వాగ్దానాలు చేశారు. మొత్తం ఒక జొన్నపాడునుంచే రు. 4150 లు వాగ్దానాలు వచ్చాయి, ఇందులో వ్యవసాయ కూలీలు రు. 15 వాగ్దానంచేశారు. జొన్నపాడునుంచివచ్చిన రైతుకూలీ కామ్రేడ్సంతా తమ త్యాగాన్ని చాటారు. మా ఆదర్శంతో ముందుకురండని ఆచరణలో యితరులను ఉత్సాహపరిచారు.

త్యాగపటిమ

జొన్నపాడు ఆదర్శాన్ని అందుకున్నారు తక్కిన ప్రాంతాలవారు, ఒకరితర్వాత ఒకరు వాగ్దానాలుచేయడం ప్రారంభించారు. కామ్రేడ్ వై. వి. కృష్ణారావు కనుమూరు వాస్తవ్యుడు. తాలూకాయువజనసంఘఅధ్యక్షుడు. రు. 4000 వాగ్దానంచేశాడు. కామ్రేడ్ బాలకోటయ్య రు. 1000 లు, ఇంకా యిద్దరు కనుమూరు నుంచే 125 రూపాయలు వాగ్దానం చేశారు. తక్కువమందైనా మొత్తంలో జొన్నపాడును మించింది కనుమూరు. వెంటనే పామర్రు ఫిర్కా అందుకుంది. చలసాని వెంకటప్పయ్యగారు (కురుమద్దాలి) వయస్సు నలభైపైన వుంటాయి. చాలాకాలంనుంచి పార్టీలో ఉన్న వ్యక్తి. రు. 500 లు వాగ్దానంచేశారు. పొట్లూరి సుదర్శనం, సీతామహాలక్ష్మమ్మ భార్యాభర్తలు, జమీగొల్వేపల్లి కాపురస్తులు. రు. 500 లు యిచ్చారు. కాని మొత్తంమీద చూస్తే, నందివాడ ఫిర్కాతో పోటీ చేయలేకపోయింది పామర్రు ఫిర్కా. పామర్రు వెనకబడిందన్నారు ఒకాయన. కాదు యలమర్రు మొదలగు ముఖ్య గ్రామాలనుంచి కామ్రేడ్సు రాలేదు; మా ఫిర్కాలో 15 వేలు వసూలు చేస్తామని చటుక్కున సమాధాన మిచ్చాడు బాలకోటయ్య.

ఇక ముదినేపల్లి ఫిర్కా. 'ఇంత ప్రధానమైనజనరల్‌బాడీని ఆహ్వానించాడు; మీరెంత ఇస్తారు?' అన్నట్లు చూస్తున్నారు అందరూ వారివంక. అడ్డుమిల్లి గోపాలకృష్ణమూర్తి (కోడూరు) వెంటనేలేచి, వెయ్యి రూపాయిలన్నాడు. బొప్పన విశ్వేశ్వరరావు రు. 500 ఇచ్చాడు. చిలుకూరి వెంకటనారాయణ (పెదపాలపర్రు) రు. 500 వాగ్దానంచేశాడు. అగ్రిమవాసియైన ఉప్పులపాటి కనకరత్నంగారు ఒక నవరసు బంగారం ఇచ్చారు. ఎక్కువమంది స్త్రీలు ముదినేపల్లి ఫిర్కానుంచి వచ్చారు. మీటింగుకువచ్చిన స్త్రీలంపరూ తమ త్యాగాన్ని ప్రదర్శించారు.

ముఖ్యంగా పేర్కొనవలసింది డి. వి. రెడ్డి, మహేశ్వరపురం కాపురస్తుడు. ఈయన పార్టీసానుభూతిపరుడు. కాని త్యాగంలో చాల ముందుకు వచ్చి వెయ్యిరూపాయలు వాగ్దానమిచ్చారు. వానపాముల వాస్తవ్యులు కాజ చంద్రం, అట్లూరి ఉమామహేశ్వరరావు, చెరి ఐదువందలు ఇచ్చారు. గుడ్లవల్లేరు ఫిర్కావంతు వచ్చింది. కామ్రేడ్ మంగపతిరావు (తాలూకా కమిటీ సభ్యుడు) తన భాగం అమ్మి రు. 2500 ఇస్తానని వాగ్దానం చేశాడు. కామ్రేడ్ అచ్యుతరామయ్య (గుడ్లవల్లేరు) రు. 1000 వాగ్దానం చేశాడు.

కార్మికులు నెలజీతాలిచ్చారు

గుడివాడనుంచి వచ్చిన ప్రెస్‌వర్కర్లు, ఉపాధ్యాయులు, మునిసిపల్ కార్మికులు చాలమంది తమకు వచ్చే ఒకనెల జీతాలను ఇస్తామని వాగ్దానంచేశారు. పరుచూరి భైరాగిరావు, ఆల్లాడి వెంకటేశ్వరరావు అనే ఇద్దరు ప్రెస్ కార్మికులు-ఒకరు రు.27, మరొకరు రు.25లు నెల జీతాలు యిచ్చారు. కుట్టుపనిమీద జీవించే పువ్వుల కృష్ణమూర్తి రు. 15 లు ఇచ్చాడు. ఇద్దరు ఉపాధ్యాయులు చెరి రు.25 ఇచ్చారు. డాక్టరు గంగాధరరావు రు. 50 ఇచ్చాడు.

దాదాపు అందరూ ఇవ్వడంఅయిపోయింది. ఇంతలో ఒక మహిళా కామ్రేడ్, నేను వెయ్యి రూపాయలు ఇస్తానని లేచింది. ఎవరు ఈమె? కామ్రేడ్ బి. వి. రావు ఆనాటి సమావేశానికి అధ్యక్షత వహించాడు. ఆయనభార్య ఈమె. బి. వి. రావు ఇదివరకే తన భాగం భూమి అమ్మి 10 వేల రూపాయలు పార్టీకిస్తానని వాగ్దానం చేశాడు. ఇటువంటి పరిస్థితులలో ప్రభావతి మరొక వెయ్యిరూపాయలు ఇచ్చిందంటే, నిజంగా (మిగతా 10 వ పేజీలో)

తెనాలి తాలూకా

"ప్రజాశక్తి" దినపత్రికకు 5 లక్షల నిధిని ప్రోగుచేయాలని కామ్రేడ్ సుందరయ్య ఇచ్చిన సందేశం ఆంధ్రదేశంలో వాడవాడల వ్యాపించింది. దినాదినాభివృద్ధి పొందుతూన్న ఆంధ్ర ప్రజాఉద్యమాలన్నీ ఇలాంటి దినపత్రిక కోసం స్వాతివానకు ముత్యపు చిప్పల్లాగా ఎదురుచూచాయి. నేడావాంఛ ఈడేరే సూచన కామ్రేడ్ సుందరయ్య సందేశంలో కనుపించాయి. వసూళ్ళ కార్యక్రమం వేసుకోడానికి అన్ని తాలూకాల్లోను కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, సానుభూతిపరులు సంతోషాతిశయంతో సర్వ సభ్యసమావేశాలు జరిపారు.

తెనాలితాలూకాలో జనరల్‌బాడీసమావేశం ఈనెల 16వ తేదీని, కామ్రేడ్ ఎస్. వి. మల్లిఖార్జునశర్మ అధ్యక్షత కింద 400 మందితో జరిగింది. కామ్రేడ్ బసవపున్నయ్య జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులనువివరించాడు. అంతర్జాతీయంగా ప్రజాస్వాతంత్ర్యోద్యమం, ఆటంకాల నన్నిటినీ గడచుకుంటూ ఎలా పురోగమిస్తుందో వర్ణించారు. మన రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలు చాల ఉన్నత స్థాయికి వచ్చాయి. వీటిని తగినమార్గాలలో నడపడానికి చిత్తశుద్ధి, ప్రజాసేవ తత్పరత గల దినపత్రిక అత్యవసరం-అని ఉద్బోధించాడు బసవపున్నయ్య.

తరువాత యల్. బి. గంగాధరరావు తాలూకా సభ్యుల కార్యక్రమాన్ని వివరించారు. ఇక "ప్రజాశక్తి" దినపత్రికకు విరాళాలవంతు వచ్చింది. కామ్రేడ్స్‌చూపిన త్యాగదీక్ష ఎంతో ఉత్తేజకరంగా వుంది.

కామ్రేడ్ మంకర తిరుమలరావు (రేపల్లె తాలూకాలో ధనిక రైతుబిడ్డ) తనవంతు పదివేలన్నారు. తెనాలి తాలూకా రైతుసంఘ అధ్యక్షులు కామ్రేడ్ రావిఅమ్మయ్య రు. 1000 వాగ్దానంచేశారు. తెనాలి వాస్తవ్యుడు కామ్రేడ్ ఉయ్యూరు కాశీ కొద్దిపాటి ఆస్తిపరుడు. తనవంతు రు 1000 అంటూ అక్కడే చెల్లించాడు. కామ్రేడ్ కోగంటి కోటయ్యది దావులూరు. 1920 - 30 జాతీయోద్యమాల్లో పాల్గొన్న దేశభక్తుడు. కమ్యూనిస్టుల ప్రజాసేవాదీక్షను చూచి ఉత్సాహం పొంది, పార్టీలోకి వచ్చిన నిష్కళంక ప్రజాసేవకుడు. ఈమధ్యనే ఆస్తి చాలా ఖర్చుఅయిపోయినా, ప్రజాశక్తికి రు. 1116 లు తనవంతన్నాడు. ఇక సభలో ఉత్సాహం పొంగి పొరలింది. దావులూరు గ్రామంలో పార్టీసభ్యులు పేద రైతు-కూలీ కామ్రేడ్సు, అంతాకలిసి రు 1235 వాగ్దానంచేశారు. ఈవిధంగా ఆసభలో మొత్తం రు 14,571 లు వాగ్దానాలు వచ్చాయి. చిన్న చిన్న వాగ్దానాలు కాక తేలిన మొత్తమిది.

పార్టీ అంటే సభ్యులకు, సానుభూతిపరులకు గల భక్తిని, విశ్వాసాన్ని ఈ జనరల్ బాడీ ప్రదర్శించింది. తమ పార్టీద్వారా ప్రజాసేవ చేయడానికి, ప్రజా ఉద్యమాలను అభివృద్ధిచేయడానికి సభ్యులు - సానుభూతిపరులు ఎంత త్యాగానికైనా సిద్ధమేనని చెప్పడానికి యీ సభ ఒక ప్రబల నిదర్శనం.

ప్రభుత్వందగ్గర పార్టీ డబ్బు తిని బ్రతుకుతుందనీ, ప్రభుత్వంయొక్క దయాదాక్షిణ్యాలు లేకపోతే పార్టీ ఏమైపోయేదో అని, పిచ్చివాగుడు వాగేవాళ్ళకు తలదిమ్మెత్తించే జవాబు యీ తెనాలి తాలూకా పార్టీ సర్వసభ్యుల సమావేశం ఇచ్చింది.



కరువుతో ప్రాణాలు కడెక్కిపోతున్న ఇలాంటి వారిమీద జాడ్యాలమహామారి విరుచుకుపడింది.

ఉత్తర విశాఖలో

కరువునివారణకు ఆంధ్ర విద్యార్ధుల కృషి

ఎన్.వి. నారాయణ : వాలంటీరు

"ఉత్తరవిశాఖ జిల్లాలో 4 తాలూకాలు తుపాను దెబ్బకు, కరువు కాటకాలకు గురియై మృత్యుదేవతకు నిలయమైనాయి. ఈ స్థితిచూచి, నాగుండెతరుక్కుపోయింది. వళ్ళు జలదరించించింది.

"విద్యార్థి సోదరులారా : భావిభారతసౌధమునకు మూలకంబ మనదగిన మీరు, కుటుంబాలతో మృత్యువాతబడుచున్న మీసోదరాంధ్రులను రక్షించు భారము వహింపక తప్పదు. స్వచ్ఛంద సేవకులుగా చేరుడు. విరివిగా విరాళములు పంపుడు"

— పీపుల్సు రిలీఫ్ కమిటీకి, ఆంధ్రవైద్య సంఘానికి అధ్యక్షులు, 60 ఏండ్ల వృద్ధు, సుప్రసిద్ధ కాంగ్రెసువాది అయిన డాక్టరు పాలకోడేటి గురుమూర్తిగారి మాటలు యివి. గురుమూర్తిగారి ప్రతి మాటలోను విశాఖ కరువు ప్రతిబింబించింది. ప్రతిమాట ఆంధ్రుల హృదయాన్ని కలచివేయక మానదు.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థిఫెడరేషన్ డాక్టరు గురుమూర్తిగారి పిలుపువిని, ఉత్తరవిశాఖకు వలంటీర్లను పంప నిశ్చయించింది. విశాఖ నుండి ఇద్దరిని, కృష్ణా నుండి 3 గురిని, గుంటూరు నుండి 6 గురిని మొత్తం 11 మందిని వలంటీర్లుగా పంపింది. ఎక్కడో 600 మైళ్ళ దూరానఉన్న మదరాసువిద్యార్థిసంఘం 4 గురు వైద్యవిద్యార్థుల్ని, రు. 700 ను పంపి తన సోదరభావాన్ని చాటింది. యీ మదరాసు దళానికి బెంగాలు కరువు సందర్భంలో పనిచేసి అనుభవం గడించిన బాలక్రిష్ణన్‌గారు నాయకుడు. మదరాసు వైద్యవిద్యార్థి బృందముతోబాటు మేము సోంపేట - టెక్కలి తాలూకాలలో కొన్ని గ్రామాలు తిరిగాం. వానిలో యిసుకలపాలెం - కరువాకసున్నాపల్లి - మంచినీళ్ళపేట - అల్లాడు - పోతునాయుడుపేట ముఖ్యమైనవి.

కరువాకసున్నాపల్లి నౌపడ గ్రామానికి 5 మైళ్ళ దూరంలో ఉంది. యిది తీరపు గ్రామం. ఇచట ప్రజలవృత్తి చేపలుపట్టుకోవడం. రెండవది బర్మాకు కూలీలుగా వెళ్ళడం. తుపాను వచ్చాక ఆ చేపలుకూడ దొరకడం లేదు. బర్మా కాందిశీకులకు ప్రభుత్వం యివ్వవలసిన బత్తెం సరిగా అందుటలేదు. నాయుడులనబడే గ్రామమునసబులుదుష్టగ్రహాలలాగా అడ్డుపడుతున్నారు. లంచాలు తీసుకొంటున్నారు. ఈ విషయం మేము జిల్లా లేబరు ఆఫీసరుగారికి తెలియపర్చాం. ఆయన, మా అఫీసర్లు అంతాచేశారు. ప్రజలు మిమ్మల్ని మోసం చేస్తున్నా రన్నారు. మేము, వేలిముద్రలతోసహా మహజర్లు తీసుకొచ్చాము అంటే, వాటినిచూసే బాధ్యత అసిస్టెంటు జిల్లా లేబరు అఫీసరుకు యిచ్చాడు. ఆయనకు కరువాకసున్నాపల్లి ఎక్కడఉన్నదీ తెలియదు; తదుపరి మేం జిల్లా లేబరుఆఫీసరు సూచనప్రకారం వారివారి బంధువులు బర్మా నుండి డబ్బుపంపిన మనియార్డరు రసీదులు సంపాదించాం. దీనితో అసిస్టెంట్ జిల్లాలేబరు ఆఫీసరు, వాటివిషయం తాను ఆలోచిస్తానని వాగ్దానం మాత్రం చేశారు.

ఈ గ్రామంలో 100 యిండ్లు ఉండేవి. తుపానుకు 5 యిండ్లకప్పులు లేచిపోయాయి. ఇప్పుడు తిండిలేక యిండ్లను గాలి దేవునకు విడిచి వెళ్ళగా 20 కప్పులు పూర్తిగాచెడిపోయాయి. మేము ఈ గ్రామంలో మందులిచ్చినవారిలో 100 కి 50 మంది మలేరియా రోగులు.

నౌపడాకు 2 మైళ్ళలో యీ గ్రామం ఉంది. షుమారు 100 మంది ఉంటారు. యిచ్చట అంతానౌపడా ఉప్పుకూలీలు. సంవత్సరానికి రు. 100 యిస్తారు. రోజుకు వీరు 10 గంటలు పనిచేయాలి. మొత్తం 25 యిండ్లలో 5 యిండ్లు పాడయాయి. 10 యిండ్లు విడిచివేయబడ్డాయి. మేము మందులిచ్చిన వారిలో 100 కి 30 మంది మలేరియావల్ల బాధపడుతున్నవారు.

ఇక సోంపేట తాలూకా విషయం. ఇక్కడ యిసుకలపాలెమనేగ్రామం ఉంది. పూర్వం దీని జనాభా 1450. తుపానువల్ల యిండ్లు పడిపోయాయి. తుపాను అనంతరం సముద్రంలో చేపలుకూడ దొరకలేదు. అంచేత కొంతమంది వలస పోయారు.

1942 లో	100	మంది.
1943 లో	93	,,
1944 లో	70	,,
1945 లో	25	,,

చనిపోయారు. ఎక్కువగా కలరా, మలేరియా, ఖురుపులవల్ల చనిపోయారు. క్రితం రెండు నెలలలోనేకురుపులవల్ల 15మంది చనిపోయారు. ఈఊరిలో ప్రతిఒక్కనికి 6అంగుళాలబల్ల పెరిగిఉంది. చాలామందికి 5 అంగుళములపొడవుగల రణములున్నాయి.

రేషనింగు

సోంపేట తాలూకాలో గవర్నమెంటు ఇప్పుడు 40 తులాల రేషన్ శాంక్షన్ చేసింది. కాని రేషన్ కార్డులిచ్చుటలో గ్రామ మునసబులు కార్డుకు పావలాచొప్పున తీసుకొంటున్నారు. ఇంట్లో నలుగురుంటే, ముగ్గురికే కార్డుమీద రాస్తున్నారు. నానా అవస్థపడి కార్డు సంపాయించుకుంటే, అంగట్లో బియ్యంతక్కువ. ఏ రోజయినా దొరికితేరాళ్లు, గడ్డలమయం. బాగు చేస్తే మూడుశేర్లే కిటుతుంది. రెడ్డిసున్నాపల్లి కరువాకసున్నాపల్లిలో 100కి50 మంది రేషన్ కార్డులు రిన్యూ చేయనేలేదు.

నీటి కరువు

తిండికరువుకు నీటి కరువు తోడయింది. యామలపేట నౌపడాకు 1½ మైళ్ళ దూరం. షుమారు 500 ప్రజలుంటారు. ఊరుకొక్క టే బావి.అందులోనైనా నాలుగంగుళాల నీరుమాత్రమే వుంది. బావివద్ద తెల్లవారి లేస్తే ముష్టి యుద్ధాలు; బావిచుట్టూ మురుగూ-పురుగులూ.

సోంపేటకు 4 మైళ్ళ దూరంలో బేసి అనే గ్రామం ఉంది. ఆ ఊరిలో నీరు ఉప్పు నీరు. చెరువువద్ద స్నానాలుచేయటం, గేదెలు కడగటం, మలవిసర్జన చేయటం - జరుగుతుంది. చెరువుల నీరు తీసిగానేవుండడంవల్ల గ్రామస్తులు ఆ నీరు త్రాగుతారు. ఆరోగ్య శాఖవారు యీ విషయంలో జోక్యంకలిగించుకోవటంలేదు.

ఇలాగే 1400 మంది ఉన్న ఇసుకంపాలెంలో బావి లేదు.

ఉత్తర విశాఖలో బావులు త్రవ్వించాలని ఒక స్కీము యిదివరకు తయారయింది. కొన్ని గ్రామాలకు వాగ్దానం కూడ చేశారు. వానిలో యామలపేట ఒకటి. కాని ఈవిషయం రెవిన్యూ ఆఫీసరుకు చెప్పితే, ఇది యుద్ధసమయము; కావలిస్తే వారే త్రవ్వకుంటారు పొమ్మని సమాధానం! యిదీ కరువుబాధితులకు వీరిసాయం.

ఆస్పత్రిలో మా అనుభవాలు

"ఆస్పత్రులలోయిచ్చిన మందులతో మాకు జబ్బు నయంకాలేదు. రంగు నీళ్ళు మాకక్కర్లేదండీ!" అని ఒకరు—

"ఆస్పత్రివద్ద నాలుగుగంటలునుంచుంటే, మాకు పొట్ట జరగదండీ!" అని మరొకరు—

"మాకు మందిచ్చి గోదావరిలో పారవేస్తారు!"

అనివేరొకరు మొదటమాట్లాడేవారు. మేము రైతుసంఘ వర్కర్లను వెంటతీసుకునివెళ్ళి, మేముకూడ ప్ర జా సే వ కు లమని తెలియ చెప్పితే, యిప్పుడు ఎక్కువమంది ఆస్పత్రికి వస్తున్నారు. దీనికితోడు ఆస్పత్రిలో మేము వెంటవెంటనే,ఆలస్యంకాకుండా,మందులిచ్చి పంపేసేవాళ్ళం. రైతుసేవకులు లేని నౌపడాలో మాపని కొంత కష్టమయింది.

రుషికుద్ద ఆస్పత్రిలోకి సంవత్సరంనుంచి నానా అవస్థపడుచూ, ఏదిబడితేఅవైద్యంచేసి, ఒక ఆకుకప్పుకొని పెద్దరణములతోరోగులు వస్తున్నారు. కాలిమీద, మజ్జిగలో ఎర్రనిరంగు కలిపినట్లుగా రక్తం కారుతూ విపరీతమయిన వాసన వచ్చేది. పాపంచేసినవాడికి వేసే శిక్షగా మన పురాణాల్లో చెప్పినట్లు వైతరణీ తలపుకు వచ్చేది. రణములు ఆస్పత్రిలో నయమవుతున్నవని తెలిసి, ఎక్కువమంది ఇప్పుడు వస్తున్నారు.

పరిస్థితు లిలావుంటే, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీ చంద్రమౌళిగారు సోంపేట తాలూకా పరిస్థితులు బాగానే ఉన్నవని పత్రికా ముఖమున ప్రకటన చేయడం ఎంతయు శోచనీయం.

ప్రజాసంఘాలు - వాటి కృషి

డాక్టరు గురుమూర్తిగారి ఆధ్వర్యాన విశాఖజిల్లా పీపుల్సురిలీఫ్‌కమిటీ పనిచేస్తోంది. ఈ కమిటీ ఆధ్వర్యమున డాక్టరు లక్ష్మి - మరి 9 మంది రైతుసంఘ వలంటీర్లు కరువు ప్రాంతమంతా తిరిగి, క్షామనివేదిక తయారుచేశారు. తదనంతరం యీ కమిటీ 50 మందితో గూడిన అన్నసత్రం నౌపడాలో స్థాపించింది. యీ సత్రాన్ని గవర్నమెంటు ఎత్తివేయ బోతుంటే, యీ కమిటీవారు బాధ్యతవహించి నడుపుతున్నారు. "యీ రోజున సత్రంలోని వారిలో అభివృద్ధిఉన్నదిరా!" అని గురుమూర్తిగారు తన సంతృప్తిని వెల్లడించారు ఒక నెలరోజుల తరవాత.

చింపి గుడ్డలతో - ఎండు డొక్కలతో వచ్చిన పిల్లలకు అన్నవస్త్రాలతోపాటు ఆటలు, పాటలు నేర్పాం. ఒకనాడు అన్నసత్రంలో పిల్లలు :

"బాలసంఘ సభ్యులం
భరతమాత పుత్రులం
పెద్దలను మించుతాం
విద్యలన్ని నేర్చుతాం"

అని పాడుతూంటే, గురుమూర్తిగారు "ఓరి వెధవా! అన్నీ నేర్చావురా!" అని తండ్రి పిల్లవానియెడల చూపే వాత్సల్యంతో అంటూంటే, గర్వపడ్డాం.

ఆంధ్ర వైద్యసంఘంవారు మూలమూలలా గాలించి షుమారు రు. 7000/- వసూలు చేశారు. యిప్పుడు నౌపడా - కంబలి - రుషికుద్దలలో ఆస్పత్రులు స్థాపించి, యీ రోజువరకు షుమారు 6000 మందికి ఉచితంగా వైద్యసహాయం చేశారు. భారత సేవాసంఘంవారు కూడా (సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటి) దేశంలో వివిధ ప్రాంతాల నుండి డాక్టర్లను పంపించి పనిచేస్తున్నారు. గవర్నమెంటుకూడ అక్కడక్కడ ఉచిత భోజనశాలలు - ఆస్పత్రులు పెట్టించింది. వలంటీర్లు 30 గ్రామాలలో 800 మందికి మందులిచ్చారు. 600 మందికి సూది మందులిచ్చారు. కంచిలిలో ఇన్‌పేషంట్లకు పాకల నిర్మాణమునకై కృషిసలిపి కొంత సామాను సంపాదించాము. కాని, యింతవరకు జరిగిన పని సముద్రంలో నీటిబొట్టే ననిపించింది మా అనుభవానంతరము. (మిగతా 10వ పేజీ)

చేనేత పారిశ్రామికుడు: ధరల కంట్రోలు

కంట్రోలులేక, ధరలు విపరీతంగాపెరిగిపోవడంవల్ల పరిస్థితులు దోపిళ్ల క్కూడా ఎలా దారితీశాయో 1942-43 సంవత్సరాల్లో చూశాం. బెంగాల్ మొదలయిన కరువుప్రాంత్రాల్లో అంతకన్నా ఘోరమైన సంఘటనలు చూశాం. దానితోధరలకంట్రోలుయొక్క అవసరాన్ని ప్రజలందరూ గుర్తించారు. కంట్రోలువల్ల ప్రజా సామాన్యానికి బాధలు తీరుతాయి. న్యాయంగా రైతు తన పాలు పంచుకోగల్గుతాడు; వ్యాపారికి సరియైన లాభం గిడుతుంది. ఒడుదుడుకులు లేకుండా అంతాసాఫీగా సాగుతుంది.

ఐతే,కంట్రోలుజయప్రదంగాసాగాలంటే, ప్రజల సహకారం కావాలి. లేకపోతే దానిని భగ్నం చేయడానికి స్వార్థపరులు వెనుదీయరు. రైతులు అధికాహారోత్పత్తికి కార్మికులు అధికోత్పత్తికి, కంకణంకట్టి ముందుకురావాలి. తమకెన్ని ఇబ్బందులున్నా దేశంకోసం,ప్రజాసామాన్యంకోసం వీరిందుకు పూనుకోవాలి.

నేతకార్మికుని కర్తవ్యం

చేనేత పారిశ్రామికుని కర్తవ్యం కూడా ఇదే. మనదేశంలో బట్టలకరువు తాండవిస్తోంది ఇది అందరకూ తెలిసిన విషయమే. ప్రభుత్వం మిల్లుబట్టలపై కంట్రోలుపెట్టి, నేత బట్టల మీద పెట్టలేదు. దానితో ఏమి జరిగింది? మిల్లుగుడ్డ దొంగ మార్కెట్టులోకి వెళ్ళింది - నేతబట్ట ధరలు చుక్కలను తాకాయి. బట్టకోసం స్త్రీ పురుషులు పడవలసిన అగచాట్లకు అంతు లేకపోయింది. దేశానికి అన్నదాతయైన రైతు చింపిరి పాతలను అతుకులు పెట్టుకోడానికి దారమైనా లేకపోయింది. బట్టలేక కార్మికులు నాగాలు కూడా చేశారు.

ఈ పరిస్థితుల్లో చేనేత కార్మికుల కర్తవ్యమేమిటి? భారత స్త్రీ పురుషుల మానాన్ని కాపాడ్డానికి నేతగుడ్డమీదకూడా కంట్రోలు ఉండాలనీ, న్యాయమయిన ధరలకు విక్రయించాలనీ, నేత పారిశ్రామిక కుటుంబాల్లోనుంచి వచ్చిన కమ్యూనిస్టులు ఆందోళన చేయసాగారు. కాని రంగా బృందమయిన ప్రగడ కోటయ్య ముఠా తుచ్ఛస్వార్థాన్ని రెచ్చగొట్టి, ధరలు యెక్కువగానే ఉండాలనీ, కమ్యూనిస్టులు నేత కార్మికులకు ద్రోహం చేస్తున్నారనీ, పెడబొబ్బలు సాగించారు.

అన్నదాతకు, కంట్రోలు ధరకు బియ్యం అందివ్వడానికి సిద్ధపడిన రైతుకు, గుడ్డనందివ్వవలసిన బాధ్యత వీరి కక్కరలేదు. గాంధీజీ పేరును, కాంగ్రెసు పేరును జపిస్తున్న ఈ ముఠా స్వార్థపరత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈవిషయాన్ని నేత పారిశ్రామికులు గుర్తించాలి. ప్రజలకు బట్ట నందివ్వవలసినబాధ్యత తమపైఉందని గుర్తించి, నేతగుడ్డపై కూడా కంట్రోలుకు ఆందోళన చేయాలి.

ఎదుర్కొంటున్న సమస్యలు

చేనేత పారిశ్రామికులను నేడుఎదుర్కొంటున్న సమస్యలనేకం. నూలు కోటా ప్రకారం ఇంకా అందడంలేదు. దొంగ వ్యాపారం ఇంకా జోరుగా సాగుతోంది. సామాన్య కార్మికులకు రంగులు దొరకడంలేదు. మజూరీల నిర్ణయం ఇంకాకాలేదు. కో-ఆపరేటివ్ సొసైటీలను స్వార్థపరులైన మాస్టరువీవర్లు భగ్నంచేయ జూస్తున్నారు. ఈ సమస్యలనన్నింటినీ పరిష్కారం చేయడానికి తీవ్ర కృషి అవసరం ప్రజల సానుభూతి సహకారాలు లేనిదే ఇదిసాధ్యంకాదు. ఐతే,ప్రజల అవసరాలనుతీర్చడానికి నేతకార్మికులు పూనుకున్ననాడే ఈ సానుభూతి సహకారాలు లభించగలవు. అందువల్ల నేతగుడ్డ ధరలు కూడా కంట్రోలు కావడానికి నేత కార్మికులు ఆందోళన చేయాలి.

ఈ నాడు నేతగుడ్డ ధర పెరగడంవల్ల నేతకార్మికులకు మజూరీలు ఎక్కువగా గిట్టవచ్చు. కంట్రోలువస్తే ఈమజూరీలుపడిపోతాయేమో అని ఆందోళన పడవచ్చు. కాని, ఇప్పటి దొంగ మార్కెట్ల రోజుల్లో కార్మికునకు మిగులుతున్న దెంత? అలా కాకుండా నూలు సప్లయి సరిగాజరిగి, దొంగ మార్కెట్టు అరికట్టబడి, మజూరీలు నిర్ణయమైతే నేతకార్మికుల ఇబ్బందులు తొలగుతాయి. సరసమైన ధరలకు ప్రజలకూ బట్ట అందుతుంది. నేతబట్ట ఉత్పత్తి కూడాఅధికం అవుతుంది కాబట్టి కంట్రోలు ధరకుప్రజలకు బట్ట నందివ్వడానికి నేతకార్మికులు ముందుకు వచ్చి, ఆవిధంగా ప్రజలసానుభూతిసహకారాలను పొంది, తమ సమస్యల నన్నిటినీ పరిష్కరించుకోవాలి. ఉభయ పక్షాలకు లాభదాయకమైన పంథా ఇది.

నేతపారిశ్రామికులకు నెంబరునూలు ప్రకారము మజూరీలు నిర్ణయించాలి. ఈ మజూరీలపై నూటికి పది చొప్పున కలిపి గుడ్డ ధర నిర్ణయించాలి. ఈ ధరల ప్రకారం నేతగుడ్డ ధర కంట్రోలుచెయ్యాలని ఆందోళనచేయాలి. కాని, మజూరీలు నిర్ణయిస్తేనే గుడ్డధర కంట్రోలు చెయ్యాలని కోరరాదు. ఇలా కోరడం ప్రజల మానాన్ని కాపాడ్డానికి షరతులు పెట్టడమే అవుతుంది. కంట్రోలు అమలులోకి రాకుండా చేయడమవుతుంది. కాబట్టి మజూరీలు మొదలయిన ఇతర కోర్కెలతోపాటే, కంట్రోలుకోసం కూడా ఆందోళన చేయాలి. ఈ విధంగా ప్రజల సహకారాన్ని పొంది చేనేత కార్మికులు తమ దైనందిన సమస్యలను పరిష్కరించుకో గలుగుతారు.

కంట్రోలు లేకపోతేనే పారిశ్రామికులకు లాభాలువస్తాయని ప్రగడముఠావారి ప్రచారం. కాని, ఈ లాభాలు వచ్చేది పారిశ్రామికులకు కాదు - స్వార్థపరులైన మాస్టర్ వీవర్సుకి, దొంగవ్యాపారులకు మాత్రమే అన్న విషయాన్ని వీరు మరుగుపరుస్తున్నారు.

— పిల్లలమర్రి వెంకటేశ్వర్లు

నూలు దొంగమార్కెట్టును సంఘశక్తితో అరికట్టారు

పులివెందల తాలూకా అంతటా దాదాపు 1000 చేనేతమగ్గాలున్నాయి. వీటిమీదనుమారు 5000 మంది తొగట, సాలె, మాల, మహమ్మదీయు లాధారపడి జీవిస్తున్నారు. వీరు ఎక్కువగా 24 నెంబరు లోపు నూలును వుపయోగిస్తారు. 30, 40 నెంబరు నూలు ఏ పాతికభాగమో వాడుతారు. తాలూకా అంతటికి 6 మంది నూలుడీలర్లు వున్నారు. క్రిందటి సంవత్సరం అక్టోబరు నెల ప్రారంభంలో చేనేత పారిశ్రామికులంతా ఈ డీలర్ల ద్వారా నూలు పర్మిటు ఫారాలకు దరఖాస్తులు పంపుకొన్నారు. ఏ కొద్దిమందికో నవంబరు, డిశంబరు నెలల్లో పర్మిటు ఫారాలు యిచ్చి తక్కినవన్నీ డీలర్లు తమవద్దనే ఉంచుకున్నారు. డీలర్లు ఏనంబరు నూలుఅయినా సరే 10పౌనుల కట్టకి మూడు నాలుగులేక ఐదురూపాయల చొప్పున చిల్లర రేటుకన్నా యెక్కువతీసుకొని,తమకనుకూలమైన వారి కమ్ముచుండేవారు. పులివెందుల సంతలో సింహాద్రిపురం డీలర్లు బహిరంగంగా బ్లాకు మార్కెటురేటుకు నూలు అమ్ముచుండే వారు. నూలు చిక్కక చేనేత పారిశ్రామికులు మగ్గాలనేత మాని నానా అవస్థలు పడుతున్నారు.

తమ సంఘశక్తిద్వారానే ఈ అక్రమాలను ఎదుర్కొనగలమని చేనేత కార్మికులు గుర్తించారు. 19-4-45 తేదీన 12 గ్రామాల నుంచి రెండువందలమంది ప్రతినిధులు, ప్రేక్షకులు సమావేశమై తాలూకా చేనేత కార్మికసంఘాన్ని యేర్పాటు చేసుకొన్నారు. ప్రొద్దుటూరులో క్యాంపు వేసియున్న జిల్లా టెక్స్టైలు అఫీసరుగారివద్దకు ఈసంఘం తరఫున డెప్యుటేషన్ వెళ్ళి డీలర్ల అక్రమాలను చెప్పుకున్నారు. ఆయన డీలర్లకు తగిన బుద్ధిచెప్పి నూలు సక్రమపంపకం సాగించమని హెచ్చరించారు. డీలర్లు పారిశ్రామికులందరికి యిప్పుడు పర్మిటుఫారాలు యిచ్చారు. డీలర్లు దిగివచ్చి సంఘ వర్కర్లతో కలిసి నూలుపంపకం సక్రమధరలకు సాగిస్తున్నారు.

జిల్లా టెక్స్టైలు కంట్రోలు ఆఫీసరుగారు డీలర్సుకందరికి, నూలు పంపకంలో గలాటాలు లేకుండా చూడాలని, తాలూకా చేనేత కార్మికసంఘ వర్కర్లతో కలిసి నూలు పంచాలని, లేకుంటే తీవ్రచర్య తీసుకోబడుతుందని హెచ్చరించారు.

సంఘశక్తిని తెలుసుకొన్న కార్మికులు తమ సంఘ సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్నారు.

ఏలూరు బట్టల బ్లాక్‌మార్కెట్టు

— మధ్యాహ్నపు కాశేశ్వరరావు

ఎక్కేకొట్టు, దిగేకొట్టు! కంపెనీబట్టలు ఎక్కడా దొరకడంలేదు. పేదప్రజలు మహాయిబ్బంది పడుతున్నారు. స్టాండర్డ్‌క్లాత్ షాపుల్లో సరుకు నిండుకుంది. అన్నీ ఖాళీ కొట్లు. నేతసరుకు మాత్రం షాపుల్లో పెట్టి అమ్ముతున్నారు. కాని వాటికి కంట్రోలులేదు. ఇష్టంవచ్చిన ధరలకు బహిరంగంగా అమ్మవచ్చు. కంట్రోలు రేట్లు నిర్ణయించిన కంపెనీ సరుకంతా దొంగమార్కెటుకు చేరింది.

— ఇవీ ఏలూరుపట్టణంలో పరిస్థితులు.

వలంటీర్ల చొరవ

దొంగమార్కెట్టును అరికట్టి, ప్రజలకు విరివిగా బట్టసప్లయి చేయడానికి కమ్యూనిస్టు పార్టీ తరఫున, పట్టణ యువజనసంఘం తరఫున, వలంటీర్లు గట్టి కాపాలా కాచారు. చివరకు 10-5-45 వ తేదీని అచోకి దొరికింది. వెంటనే వలంటీర్లు జిల్లా టెక్స్టైల్ ఆఫీసరుని వెంటబెట్టుకొని బయలుదేరారు. పసుమర్తి రాజు కొట్లో ప్రవేశించారు. తనవద్ద మిల్లుసరుకులేదని మామూలు ధోరణిలో బుకాయించాడు. ఇంతలో యితర వలంటీర్లు, టెక్స్టైల్ ఆఫీసరు ప్రత్యక్షం! దానితో బండారం బయటపడింది. ఇంతలో ప్రజలు కూడా గుమిగూడారు. "బాబూ! పట్టుకోండి, మీకడుపు చల్లగుండా!" అని ప్రశంసించారు. పాప్లయిను, పంచెలు, యితర కంపెనీసరుకు ఎంతో బయట పడింది. వలంటీర్లు ప్రజలచేత పిటీషన్లు తయారు చేయించి,సంతకాలుపుచ్చుకున్నారు. కొట్లు సీలు పడింది!

మరుచటిరోజు సీలింగురేట్లకు యీ సరుకంతా ప్రజలకు దొరికింది.

సన్నిధివీరరాఘవులుగారు బట్టల వర్తక సంఘానికి అధ్యక్షుడు. చిన్న వర్తకులకు కోటాసరుకు రాగానే, ఇతగాడు తన కొడుకుల్ని, బంధువుల్ని, పంపి సరుకంతాకొనేసి దొంగవ్యాపారం చేయడం పరిపాటి. తన కోటా సంగతి వేరే అడగక్కర్లేదు. ఈ సరుకంతా దూరంగా, బంధువుల యిళ్ళలో పెట్టి రహస్యంగా అమ్ముతాడు. వలంటీర్లు యీ సంగతి కనిపెట్టారు. దొంతురాజు అనే కిళ్ళీ వర్తకుడు యీయనకు బావగారు. అతని యింట్లో సరుకు దాచియుంచాడని తెలుసుకున్నారు. 19-5-45 ఉదయం యీ సన్నిధి వీరరాఘవులు దొంతు రాజు యింట్లో రహస్యంగా దాచిన సరుకుకి వలంటీర్లు కాపలా పెట్టారు. సరుకు తన సొంతానికి కొన్నానని మొదట దబాయించాడు, దొంతురాజు. ఒత్తిడి చేస్తే నిజం చెప్పేశాడు. సరుకంతా వరుసగా తీయించారు వలంటీర్లు. 1944 లోనే అమ్మవలసిన సరుకు కొంత, ఇప్పటి సరుకుకొంత కొన్ని వందల గజాల సరుకు బయటపడింది. ఇంకా లోపల వెతికితే కారుమూరి సుబ్బారావు అనే వర్తకుని నిలవ సరుక్కూడా బయటపడింది.

ఒకే దెబ్బకు రెండు పక్షులు !

టెక్స్టైల్ ఆఫీసరు సమక్షంలో జరిగింది, యిదంతా. ఇవన్నీ సీలు చేయించి, మధ్యవర్తుల సంతకాలు తీసుకొని, బిల్లుపుస్తకాలతో సహా టెక్స్టైల్ అఫీసరు తీసుకెళ్ళారు.

తరవాత, వలంటీర్లు యితర కొట్లవద్దకు వెళ్ళి కంపెనీబట్టంతా (మిగతా 10 వ పేజీ)

హోల్ సేల్ వర్తకుల్ని తొలగించాలి

బియ్యానికీ - ధాన్యానికీ సబబైన ధర నిర్ణయించాలి

ప్రభుత్వం బియ్యానికి నిర్ణయించిన సీలింగు ధరలకనుగుణ్యంగా ధాన్యానికిగూడ న్యాయమైన సీలింగ్ ధరలను నిర్ణయించవలసిందని క్రిందటి సంవత్సరమంతా ఎంతో ఆందోళన చేశాం. రైతుసంఘం, ప్రజా ఆహార సంఘాల తరఫున ప్రభుత్వంవద్దకు అనేకసార్లు రాయబారాలు వెళ్ళటం, మెమోరాండాలు యివ్వటం జరిగింది. బియ్యం ధరలు పెంచకుండానే, ధాన్యానికి పురివద్ద బస్తాకు పదకొండు రూపాయల ధర యివ్వవచ్చునని చక్కని ఆధారాలతో రుజువు చేశాం కూడ. అయినప్పటికీ, ప్రభుత్వం ఈ ఆందోళననంతా పెడచెవిపెట్టి, మిల్లుయజమానులను, వర్తకులనూ సంతృప్తి పర్చే ధోరణి నవలంబించింది. మనం చూపెట్టిన ఆధారాలను కాదనలేక, ధరలు పెంచామనిపించు కోటానికిగాను, ధాన్యానికి బస్తాకు రెండణాలు మాత్రం హెచ్చించింది. ఈ హెచ్చింపుతోపాటు బియ్యానికి కూడ ధరలు హెచ్చించబడ్డాయి.

బియ్యం ధరల హెచ్చింపు

కృష్ణాజిల్లాలో బియ్యం అమ్మకపు పద్ధతులలోకూడ ఈ యేడు జనవరిలో కొన్ని మార్పులు చేశారు. లోగడ మిల్లులనుంచే చిల్లర వర్తకులు సరాసరి బియ్యం తీసుకొచ్చి అమ్ముతుండేవారు. కాని యీ సంవత్సరం ఆరంభంలో మిల్లర్లకూ, చిల్లరవర్తకులకూ మధ్య హోల్ సేల్ వర్తకుల నేర్పాటుచేశారు. ఇలా నడుమంత్రంగా నియమించిన హోల్ సేల్ వర్తకులకు లాభం చూపెట్టటానికిగాను బియ్యం ధరలుకూడ హెచ్చించారు. బియ్యం ధరలు మిల్లువద్ద మొదటిరకం మణుగు 1కి రు. 8-9-3ఉంటే, ఈహోల్ సేలర్లుఅమ్మే రేటు రు. 9-0-3. రెండోరకంమిల్లువద్ద రు 7-15-3 ఉంటే, వీళ్లు అమ్మే రేటు రు. 8-6-2 లు. ఈ ధరల ప్రకారం చిల్లర అమ్మకంలో కూడ మొదటిరకానికి శేరుకు కానీ చొప్పున, రెండోరకానికి శేరుకు రెండుపైసల చొప్పునా హెచ్చించారు.

హోల్ సేలర్లను తీసెయ్యాలి

ఈరకంగా బియ్యం ధరలను హెచ్చించినందువల్ల కొనుగోలు దారులు హెచ్చుధర పెట్టి బియ్యం కొనుక్కోవలసి వస్తోంది. పోనీ బియ్యంధరలను పెంచినందువల్ల ఉత్పత్తిదారులకు ఏమన్నా హెచ్చుధర గిట్టుబాటౌతోందా అంటే, అదీ లేదు. కేవలం మధ్యలో హోల్ సేలర్సుకు మాత్రం లాభం గిట్టుబాటౌతోంది. మిల్లులనుంచి చిల్లరవర్తకులే సరాసరి బియ్యం తెచ్చుకోటానికి వీలున్నప్పుడు మధ్యలో యీ హోల్ సేలర్ల నేర్పాటు చేయటం; వీళ్ళకు లాభాలు చూపెట్టడానికిగాను, కొనుగోలు దారులపై లేనిపోని భారాన్ని మోపటం, చాల అసమంజసంగానూ, అన్యాయంగానూ ఉందనీ, హోల్ సేలర్సుని తీసివేసి, బియ్యం ధరలను యథాప్రకారంగానే ఉంచవలసిందనీ ప్రభుత్వానికి తెలియపరుస్తూ ఉన్నాం.

ఫుడ్ కౌన్సిల్ తీర్మానం

ఈ విషయమే యీనెల 15 వ తేదీన జరిగిన కృష్ణాజిల్లా ప్రజా ఆహార సంఘంలో కూడ తీర్మానించబడింది. 21 వ తేదీన బందరులో జిల్లా కలెక్టరుగారి అధ్యక్షతను జరిగిన కృష్ణాజిల్లా ఫుడ్ కౌన్సిలుసభలోకూడ యీ విషయం చర్చకువచ్చింది. గ్రెయిన్ పర్చేజింగ్ ఆఫీసరు యీ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ హోల్ సేలర్ల నేర్పాటు చేసినందువల్ల మంచిరకం బియ్యం సప్లయి అవుతాయన్న వాదాన్ని ప్రధానంగా చూపెట్టాడు. ఈ వాదాన్ని సభ్యులు వ్యతిరేకించారు. బియ్యం యొక్క మంచిచెడ్డలను తనిఖీ చేయటానికిగాను ప్రతి పట్టణంలోను ఫుడ్ యిన్ స్పెక్టర్లు వున్నారనీ, గవర్నమెంటు చూపెట్టిన నమూనాలప్రకారం బియ్యం సప్లయిఅవుతున్నాయా లేదా? అనేది చూడటం మినహా యీ ఫుడ్ యిన్ స్పెక్టర్లకు యింకో దమ్మిడీయెత్తుపని లేదనీ, విపరీతమైనలంచగొండితనం వ్యాపించి యుంటంవల్ల ఎంత నాసిరకం బియ్యం సప్లయి అవుతున్నా సరే, కళ్లుమూసుకు సర్టిఫైచేస్తున్నారనీ, వీళ్ళను తనిఖీచేస్తూ, అదుపాజ్ఞల్లో పెట్టినట్లయితే మంచిబియ్యం సప్లయి అయ్యేటట్టు చూడవచ్చుననీ, సభ్యులు వాదించారు. అందుచేత హోల్ సేలర్లనుతీసివెయ్యాలనీ, వాళ్ళకు లాభాలు చూపెట్టటానికిగాను కొనుగోలుదార్లపై వేసినభారం తగ్గించాలనీమాట్లాడారు. తీర్మానంపై సభ్యుల అభిప్రాయాన్ని తీసికొన్నప్పుడు వ్యతిరేకంగాగ్రెయిన్ పర్చేజింగ్ ఆఫీసరుగా రొక్కరే వోటుచేశారు, అందుచేత ప్రభుత్వం నియమించిన జిల్లా ఫుడ్ కౌన్సిలు తీర్మానాన్నికూడా దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం హోల్ సేలర్లను తీసివేసే విషయంలోనూ, చిల్లర అమ్మకానికి పెంచిన బియ్యం ధరలను తగ్గించి, యథాప్రకారంగా ఉంచే విషయంలోనూ పునరాలోచించవలసి యుంటుంది.

ధాన్యం ధరలను హెచ్చించాలి

ధాన్యం ధరలవిషయంలోకూడ ప్రభుత్వం తన దృక్పథాన్ని మార్చుకోవాల్సి ఉంది. కృష్ణాజిల్లా ఫుడ్ కౌన్సిలులో లోగడ అనేకసార్లు బియ్యం ధరలనుబట్టి ధాన్యానికి పురివద్ద బస్తాకు పదకొండు రూపాయలధర నిర్ణయించవచ్చుననీ, ఆవిధంగా ధరలను నిర్ణయించవలసిందనీ ప్రభుత్వానికి సిఫార్సుచేస్తూ తీర్మానాలు చేయబడ్డాయి. కాని ప్రభుత్వం యింతవరకూ యీవిషయమై తగుచర్యతీసికోలేదు. ధాన్యం ధరల విషయమై నిర్లక్ష్యతనూ, నిరాదరణనూ చూపిస్తోంది. అందుచేత ధాన్యం ధరలను తిరిగి పరిశీలించవలసిందిగానూ, న్యాయమైన ధరలు నిర్ణయించవలసిందిగానూ కృష్ణాజిల్లా ప్రజా ఆహారసంఘం మొన్నటి కార్యవర్గ సమావేశంలో తీర్మానించింది. 21 వ తేదీన బందరులో జరిగిన జిల్లా ఫుడ్ కౌన్సిలులోకూడ తీర్మానం చేయబడింది. ప్రభుత్వం వెంటనేతగు చర్య తీసికోవలసిందిగా ప్రజలు ఆందోళన చేయాలి.

మినుముల సమస్య

తర్వాత కృష్ణాజిల్లాలో మినుములసమస్య ఒకటి చాల గడ్డుగా ఉంది. ఈ జిల్లానుంచి కొత్తమినుముల ఎగుమతికి పర్మిట్లు యివ్వకపోవటంమూలంగా ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. కొత్త - పాత మధ్య బస్తాకి పదిరూపాయలదాకా తేడాఉంది. పాతవాటికి మాత్రమే పర్మిట్లు ఇస్తుండటంవల్ల కొత్తవాటికి ఎగుమతిచేయుటకు వీలుండటంలేదు. ఈవంకతో వర్తకులు కొత్తవాటికి ధరలు పూర్తిగా తగ్గించివేశారు. పాతమినుములేమో ఎక్కువగా వర్తకుల చేతుల్లోనే ఉన్నాయి కాని రైతులవద్దలేవు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, వర్తకులు తమవద్దఉన్న పాతవాటిని ఎక్కువ ధరలకు ఎగుమతిచేసుకొంటూ, కొత్తవాటినేమో చౌకధరలకుకొని నిల్వచేస్తున్నారు. మధ్యన రైతులు మాత్రం సబబైన ధరలు గిట్టుబాటుగాక, నష్టానికి లోనుకావాల్సివస్తోంది. అందుచేత కొత్తా-పాతా అనే విచక్షణలేకుండా, అన్నిటినీ ఎగుమతి చేయటానికి పర్మిట్లు యివ్వాల్సిందిగా కృష్ణాజిల్లా ప్రజా ఆహార సంఘం ప్రభుత్వానికి సూచించింది. కృష్ణాజిల్లా ఫుడ్ కౌన్సిలుకూడ యిదేవిధంగా సిఫార్సుచేసింది. కాబట్టి ప్రభుత్వం వెంటనే కొత్తవాటికికూడ ఎగుమతి పర్మిట్లు యిప్పించాలి.

కృష్ణాజిల్లా ప్రజాఆహారసంఘం

కృష్ణాజిల్లా ప్రజా అహారసంఘ సమావేశంలో మినుముల విషయంలోనూ, హోల్ సేల్ వర్తకులను తీసివేసే విషయంలోనూ పైన తెలియపర్చిన తీర్మానాలేకాక, మరి కొన్ని తీర్మానాలు చేయబడ్డాయి. కో-ఆపరేటివ్ స్టోర్సుకే బియ్యం పర్మిట్లు యిస్తుండాలని ఒకతీర్మానంచేస్తూ నందిగామ తాలూకాలో కో-ఆపరేటివ్ స్టోర్సుకున్న బియ్యం పర్మిట్లను రద్దుచేసి, ప్రయివేటు వర్తకుల కివ్వచూస్తున్న స్థానికాధికారుల చర్యను ఖండించారు. జిల్లా అంతటా కూడ సర్వసాధారణంగా స్టోర్సు ద్వారానే బియ్యం అమ్మకం జరిపించవలసిందనీ, హోల్ సేల్ డిస్ట్రిబ్యూషన్ కూడ సెంట్రల్ కో-ఆపరేటివ్ స్టోర్సు ద్వారానే చేయించవలసిందని జిల్లా కలెక్టరుగారిని కోరారు. బట్టల కొనుగోలు విషయంలోగాని, సప్లయి విషయంలోగాని ప్రజలకున్న యిబ్బందులను తెలియజెప్పుకోటానికి, తదితర సలహాల నిచ్చుటకూ క్లాత్ డిస్ట్రిబ్యూషన్ కమిటీలలో కేవలం వర్తకులకేకాక, ప్రజా ప్రతినిధులకు కూడ ప్రాతినిధ్య మివ్వవలసిందిగా బెజవాడ టెక్స్టైలు ఆఫీసరుగారినికోరుతూ మరోతీర్మానం చేయబడింది. కొల్లేటిముంపు నివారణ స్కీముపై పరిశోధనలు పూర్తిచేయించి పని ప్రారంభించవలసిందిగానూ, పెదలంక మురుగు కాల్వకు సంబంధించిన స్కీమును కూడ వెంటనే పూర్తిచేయించ వలసిందిగానూ, గత సంవత్సరం ఆయకట్టులో చేర్చుకోబడ్డ భూములనన్నింటినీ సాగులోకి తీసుకువచ్చే దానికి పర్మిషన్ యిప్పించవలసిందిగానూ, అందుకవసరమైన కాలవలను త్రవ్వించవలసిందిగానూ చీఫ్ యింజనీరుగారిని కోరారు.

— కొల్లగడ్డ రాజగోపాలరావు

కడెవరంలో

గ్రామ పెత్తందార్ల చర్యలు

కడెవరం (తెనాలితాలూకా)లో రైతుకూలీ సమస్య ప్రతిమించి రాగానపడింది. పోయిన కుప్ప నూర్పిళ్ల తరుణంలో, అనగా అయిదు నెల్ల క్రితం, కూలీలు తమకు యిచ్చే రోజు కూలి మూడు మానికెల తవ్వెడు గింజలు చాలవని, నూర్పిళ్ళలో మామూలు కూలితోపాటు అన్నం రెండుపూటలు పెట్టాలని, రైతుల్ని అడిగారు. నూర్పిళ్లలో అన్నంపెట్టే అలవాటు చుట్టుపట్ల చాలగ్రామాలతో వుంది. కాని, కూలీల కోర్కెకు గ్రామంలోవున్న పెద్ద రైతులు భయపడ్డారు. ఈనాడు అన్నం పెట్టమని, రేపు ఇంకొకటి, ఎల్లుండిమరొకటి కోరతారు. కాబట్టి మేము అన్నం పెట్టమన్నారు. కూలీలను పనిపాటల్లోకి పిల్వటం మానేశారు. గ్రామంలోవున్న స్వార్ధపరులు బత్తుల చినరాఘవయ్య, కడియాల కోటిస్వామిగార్లుకూలీలనుఅణగత్రొక్కాలనే దురుద్దేశ్యముతోకొందరు రైతుల్ని ఒకముఠాగాఏర్పరచి, కేసులు నడిపేటందుకుగాను ఎకరానికి 20 రూపాయల చొప్పున రు.13 వేలు పోగుచేశారు. సమస్యా పరిష్కారంకోసం స్థానిక రైతువర్కర్లు, తాలూకా బాధ్యులు, అనేకసార్లు రాజీకి ప్రయత్నించారు. కాని ప్రతిసారి రాఘవయ్య, కోటిస్వాములు అడ్డుపడుతూవచ్చి రాజీ కుదరకుండా చేశారు. అంతటితో తృప్తిచెందక తాము ఏర్పరచిన ముఠా సహాయంతో గ్రామాన్ని అగ్నిప్రమాదాలకు గురిచేశారు. గడ్డి వాములకు, బీదరైతుల కూలీల ఇండ్లకు నిప్పంటింపించి, కూలీలే అంటిస్తున్నారని యిప్పటికి ఆరుసార్లు పోలీసు రిపోర్టులు యిచ్చారు. 18 మంది వ్యవసాయ కూలీలను పోలీసుస్టేషనుచుట్టూ త్రిప్పుచున్నారు.

కడెవరం వ్యవసాయ కూలీలు ఇప్పటికి నాలుగు సంవత్సరాల నుండి కూలి సంఘమేర్పరచుకొని, పూర్వపు దురలవాట్లుమానుకొని, సంఘ చైతన్యంతోతమ కోర్కెలు నెరవేర్చుకోవటానికి నిలబడ్డారు. గ్రామశ్రేయస్సుకోసం కూలీలు, తగులబడుచున్న వాములు, ఇండ్లు ఆర్పటానికిపోతే, 'ఆర్పనక్కర్లేదు; పోతం పోనివ్వాల్సిందే' అంటూ ఈస్వార్ధపరులు ఆటంకపరుస్తూ వచ్చారు. అంతటితో సంతృప్తిపడక, కమ్యూనిస్టులు వాములు, ఇండ్లుతగులపెట్టిస్తున్నారని, నాలుకబుజానవేసుకొనివూరూర నీచాతినీచ ప్రచారం చేస్తున్నారు. వారు తమ జీవితాలలో ఎన్నడూ కాంగ్రెసుసభ్యులుగా జేరినపాపాన పోలేదు. కానితమచర్యలపట్లప్రజలసానుభూతినిసంపాదించడం కోసం కాంగ్రెసు బురఖా తగిలించుకున్నారు.

కడెవరం గ్రామప్రజలు నిజాన్నిగుర్తించి, ఈస్వార్ధపరుల కుత్రలను, వీరుచేసేదుర్మార్గాలను అరికట్టి, కూలీలన్యాయమయిన కోర్కెలమతీర్చి, రైతు-కూలిసామరస్యానికి పాటుబడాలని కోరుతున్నాను. వ్యవసాయ తరుణ మాసన్నమైంది కాబట్టి, కూలీలుఉదయమే పనిలోకి వచ్చినట్లయితే రోజుకు నాలుగు మానికలు, అన్నంతినివచ్చినట్లయితే మూడు మానికల చొప్పున గింజలు యిచ్చి, పౌరరక్షణ దళాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరుచున్నాను.

— కంఠంనేని వెంకట సుబ్బయ్య

అభివృద్ధి నిరోధకులకు ఆటకట్టు

— తాపీ మోహన్ రావు

"దుష్టనాజీశక్తులపై విజయం సాధించామని ప్రజలు బ్రహ్మానందంతో ఉంటే, ఆ ఆనందామృతంలో విషపుబొట్టు వేయటమే దీని ఉద్దేశ్యము."

ట్రస్టీ సమస్యమీద అభివృద్ధి నిరోధకులు లేపిన గాలిదుమారాన్ని ఖండిస్తూ 'ప్రవ్దా'లో రాసిన ఒక వ్యాసంలోని మాటలివి. ట్రస్టీకి శత్రు విమోచనం కలిగించింది యుగోస్లావియా సేనలు. అక్కడి జనాభా చాలవరకు స్లావ్ జాతికి చెందినవారు. పూర్వం యుగోస్లావియాకు చెందిన యీ రేవు పట్టణాన్ని ఇటలీవారు బలవంతంగా లాక్కున్నారు. అలాంటి ట్రస్టీ పట్టణాన్ని యుగోస్లావియా దేశభక్తులు స్వాధీనం చేసుకొని, అక్కడ ప్రజాస్వామిక పద్ధతులపై పాలకవర్గాన్ని నెలకొల్పినందుకు మండిపడ్డారు బ్రిటిష్ అధికారులు. మార్షల్ టిటో అవలంబిస్తున్న పద్ధతి హిట్లరు, ముసోలినీ, టోజోల పద్ధతి అంటూ నోటికివచ్చినట్లు వాగాడు ఫీల్డుమార్షల్ అలెగ్జాండర్. గ్రీసులో ఫాసిస్టు అనుకూలుర్ని వెంటవేసుకొని, దేశభక్త దళాలపై కత్తిదూసిన "యోధుడు" ఈ అలెగ్జాండరే. తన ప్రజలందరిచేత కన్నతండ్రిలా పూజించబడుతున్న మార్షల్ టిటోని ఈయన హిట్లరు, ముసోలినీలతో పోల్చడం నిజంగా ఆశ్చర్యం కాదు. అలా పోల్చడంతో ఊరుకోలేదీయన. ట్రస్టీ పరిసరాల్లోకి తన సేనల్ని కూడా తెచ్చాడు. బ్రిటిష్ యుద్ధనావల్ని ఆ ప్రాంతంలో గస్తీతిప్పాడు. 'గ్రీసు' నాటకాన్నే తిరిగి ప్రదర్శించడానికి అంతా సిద్ధంచేశాడు.

"ట్రస్టీ ప్రస్తుతం ఇటలీ రేవుపట్టణంకదా. ఇటలీవారితోనే నేరుగా సంప్రదించి ఈ సమస్యను పరిష్కరించుకుంటామ"ని మార్షల్ టిటో సూచించాడు. పనికిరాదంటున్నాడు అలెగ్జాండర్. యూరపులో యిప్పుడిప్పుడే నెలకొనబోతున్న శాంతికి అలెగ్జాండర్ ప్రవర్తన ఎంతైనా ప్రమాదకరం. ఈ ప్రమాదం విరుచుకుపడకుండా చూస్తున్నాడు టిటో. తగాదాకుఒకకారణమైన కారింతియా(దక్షిణ ఆస్ట్రియాలోని రాష్ట్రము)నుంచితన సేనల్ని వెనక్కి మరలించాడు. మరలించినదే తడవుగా అక్కడ అంతవరకు స్లావ్ జాతివారిని పీడిస్తున్నవారు తిరిగి తమ దౌర్జన్యాలను ప్రారంభించారు. మార్షల్ టిటో యీ సమస్యలను మిత్రరాజ్యాల చేతిలో పెట్టాడు. 'రక్త సంబంధంగల మా ప్రజలందరూ ఒకే సరిహద్దుల్లో వుండేలా చూడాలంటున్నాడు.

"ఏ ఆశయంకోసమైతే ఈ ఘోరయుద్ధం సాగించామో, విజయం సాధించిన మరునాడే దానికోసం తిరిగి పోరాడవలసివస్తే అది చాల విషాదకర మవుతుంది" అని హెచ్చరిస్తున్నాడు టిటో.

విజయ ఫలితం ప్రజాశక్తుల చేతిల్లోంచి తొలగించి అభివృద్ధినిరోధకుల చేతిలో పెట్టడానికి జరుగుతున్న ప్రయత్నం ఒక్క ట్రస్టీలోనేకాదు. ఆస్ట్రియాలో సోవియట్ తాను వశపరచుకున్న ప్రాంతంలో ప్రజాస్వామ్యవాదుల తాత్కాలిక ప్రభుత్వాన్ని నెలకొల్పింది కాని బ్రిటిష్వారు తమ చేతిక్రిందవున్న ప్రాంతంలో అభివృద్ధి నిరోధకులమిలిటరీ నియంతృత్వాన్ని స్థాపించారు.

ఇక జర్మనీలో సంగతి లోగడ ఉత్తరాధికారిని గద్దెనెక్కించినట్లు జర్మనీలో ఆడ్మిరల్ డానిట్జ్ ముఠాను అధికారంలోకి తేబోయారు బ్రిటిష్, అమెరికన్ అధికార్లు. బ్రిటిష్, అమెరికన్ ప్రజలీ చర్యను ఖండించారు. సోవియట్ పత్రికలు తీవ్రంగా విమర్శించాయి. దానితో ఆనాజీలను అధికారంలోనుంచి తొలగించి, యుద్ధఖైదీలుగా అరెస్టుచేశారు.

"అంతరించి పోతున్న ఫాసిజాన్ని తిరిగి నిలబెట్టడానికి జరిగిన ప్రయత్నంకాదు కదా ఇది?" అని 'ప్రవ్దా'పత్రిక ప్రశ్నించింది. ఇక లండనులోనిపోలెండుముఠాతంత్రాలుఅందరూ ఎరిగినవే. వీరి చర్యలను గురించి 'రెడ్ స్టార్' పత్రిక ఇలా రాసింది. "సోవియట్ తో యుద్ధానికి రెచ్చగొట్టడమే ఈముఠా ఉద్దేశమని తెలిసినప్పటికీ, బ్రిటిష్ రాజధానిలో, బ్రిటిష్ డబ్బుతో, బ్రిటిష్ పత్రికల్లో వీరి ప్రచారం సాగుతూండడం ఆశ్చర్యకరము.

"శాంతినికోరే ప్రతివారూ గొంతై త్తిప్రశ్నిస్తున్నారు, గోబెల్సుయొక్క ఈ పోలిష్ వారసులు ఇలాంటి ప్రచారం చేయడానికి ఇంకెంతకాలం అవకాశమిస్తారు!" నాజీ దుష్టగ్రహాల కూటమి అంతరించి పోతూంది. దానితో ఈ సన్నాసాలుకూడా అంతరించే రోజులుదగ్గరగా పడుతున్నాయి. బ్రిటనులో ఫాసిస్టు అనుకూలుర, అభివృద్ధి నిరోధకుల, పరిపాలన త్వరలో ముగియనుంది. అద్యక్ష ట్రూమన్ పరిస్థితులను చక్కబరచడానికి మాస్కోకి, లండనుకి ప్రత్యేక రాయబారులను పంపవలసి వచ్చింది.

ఇక శాన్ ఫ్రాన్సిస్కోలో మేందేటు దేశాల, వలసరాజ్యాల ప్రజల సౌఖ్యాభివృద్ధులను నిర్ణయించే 'ధర్మకర్తృత్వసంఘం'లోకి సోవియట్ కి, చైనాకు స్థానంలేకుండా చేయబోయారు మొదట. కాని తరవాత ఈరెండిటికీస్థానం ఇవ్వక తప్పింది కాదు. అంతే. ఇంతకాలం సామ్రాజ్యవాదుల చేతిలోబడి నలిగిపోతున్న కోటానుకోట్ల ప్రజల భావిగతి ఇకమీదట ఒక ప్రజాస్వామిక సంస్థ చేతిలో ఉంటుందన్నమాట. అంతేకాదు — ఈ ప్రజల సంపూర్ణ స్వాతంత్ర్యం కూడా పై సంఘం యొక్క ఆశయాల్లో ఒకటిగా ప్రకటించాలని సోవియట్ పట్టుపట్టి పనిచేస్తూంది. ఈ ప్రతిపాదన కూడా నెగ్గే సూచనలు కనబడుతున్నాయి.

ఈ విధంగా సోవియట్ ప్రతినిధివర్గం శాన్ ఫ్రాన్సిస్కోలో ప్రపంచ ప్రజాసామాన్యం యొక్క వాంఛలను ప్రతిధ్వనిస్తూంది. విజయమకుటాన్ని అభివృద్ధి నిరోధకుల చేతిలోకి పోకుండా కాపాడ్డానికి పాటుపడుతూంది.

29—5—45.

బెజవాడ దెబ్బలాటకు కారణాలు

(4 వ పేజీ తరువాయి) దినపేజీ కమ్యూనిస్టులను దూషించే "వెంగమ్మ" బండికట్టి వూరేగింపు చేయటానికి ప్రయత్నించారు వీరు. పెద్ద మనుష్యులచే చెప్పించి మందలించాం. కోసం పట్టలేక మరునాడు మా పార్టీ ఆఫీసుపైకి దాడి వచ్చారు. బుద్ధిగరపి పంపాం.

ఇటీవల ఘటనలు

ఇక 21-5-45 సాయంత్రం గణపతిరావు దగ్గరవుండి ఎడ్ల కోటేశ్వరరావును (పార్టీ సభ్యుడు) కొట్టించారు. 22-5-45 న కామ్రేడ్ ఎల్లారావును కొట్టారు. ఎందుకా యింతటి అఘాయిత్యానికి పూనుకున్నారని, యీ సంగతి ప్రజలందరికి తెలియజేసి వారిచేతనే బుద్ధిచెప్పించుదామని బహిరంగసభ ఏర్పాటు చేయుటకు 22 రాత్రి 8 గంటలకు ప్రచారం చేయించుతున్నాం. ప్రచారకులు వేణుగోపాలస్వామిగుడివద్దకు వచ్చేసరికి దాదాపు50మంది కర్రలతో, రాళ్లతో చుట్టుముట్టినారు. ప్రచారకులు ధైర్యసాహసాలతో దుండగీడులను ఎదుర్కొన్నారు. వారు కాలికి బుద్ధిచెప్పుకొని పారిపోయారు. ఈ పారిపోయిన పిరికిపందలు, మాపార్టీ కామ్రేడ్స్ తిరిగి వెళ్ళిపోయారుగదా అని గ్రహించి, జోషినగరు ఆఫీసు బద్దలుకొట్టి, పుస్తకాలు తగులబెట్టి, కుర్చీలు దొంగిలించారు. కామ్రేడ్ దిగంబరరావును కొత్తపేట యువజనసంఘ ఆఫీసువద్ద గణపతిరావుగారు దగ్గరవుండి కొట్టించి, జండా తగులబెట్టి వెళ్లారు. 23-5-45 వుదయం 9 గంటలకు 30 మంది రౌడీమూక, చిట్టి, గణపతిరావుగార్ల సలహామీద, చిట్టి వ[illegible]రోలోని మా యువజనసంఘ ఆఫీసుమీద దాడిచేశారు. అక్కడ నివసించు యిరువురు రాజు సోదరులు (పార్టీ సభ్యులు), ఒక హరిజన సోదరుడు పత్రిక చదువుకుంటున్నారు. ఆఫీసును రక్షించే నిమిత్తం వారు అమోఘంగా పోరాడారు. కాని రౌడీలు అత్యధిక సంఖ్యాకులుగా ఉండడంవల్ల దెబ్బలుతిని పడిపోయారు. ఇవీ జరిగిన ముఖ్యఘటనలు. 21 నుండి, 23 వ తేదీ మధ్యాహ్నంవరకు పోలీసులు ఏమీ జోక్యం కలిగించుకోలేదు.

24 న మా వారిని 13 గ్గురిని, వ్యతిరేకులను 7 గురిని అరెస్టుచేసి రాత్రికి జామీను మీద విడుదల చేశారు.

ఆంధ్రపత్రిక, హిందూ విలేఖరుల తప్పుడు వ్రాతలు

తగాదాకు కారణం, రౌడీల దుండగాలు యిలావుండగా 27-5-45 న ఆంధ్రపత్రిక, హిందూ పత్రికలలో శుద్ధ తప్పుడు తడకలు అల్లారు. ఆంధ్రపత్రిక విలేఖరి ఏనాటినుండో మాపార్టీ ద్వేషి ఎన్నో ఘటనలలో యిలాగే తప్పులు వ్రాశాడు. ఏవిధంగా ప్రజలను మభ్యపెట్టి, మాపైకి రెచ్చగొట్టుటకు మార్గంవుంటే, ఆవిధంగా వ్రాస్తాడు. పైవిషయాలు చదివినవారికి ఆంధ్రపత్రికలో వ్రాసినవి శుద్ధఅబద్ధాలని గ్రహించకపోరు.

చిట్టి, గణపతిరావుగార్ల అసత్యాలు

ఇంతకాండ వెనుకవుంచుకొని, చిట్టి, గణపతిరావుగార్లు పరోక్షంగాను, ప్రత్యక్షంగాను రౌడీలను, త్రాగుబోతులను మాపైకి పంపుతూ, దెబ్బలాటలను పెంచుతున్నారు. చిట్టి, గణపతిరావుగార్లు 24 న రౌడీలకు జామీను యివ్వటానికి పోలీసులతో మంతనాలాడారు. రోజూ పోలీసులచుట్టూ చిట్టిగారు తిరుగుతున్నారు. కమ్యూనిస్టు వ్యతిరేకుల నందరిని సంఘటిత పరచుటకు ప్రయత్నిస్తున్నారు. సత్యం, అహింసయే మా ధర్మాలని చెప్పే వీరిరువురు అబద్ధాలు ఆడటానికిగాని, హింసాకాండ జరిపించుటకుగాని వెనుదీయుటలేదు.

వీరి నిజోద్దేశాలు తెలిసినవారంతా వీరిని అసహ్యించు కుంటున్నారు. అమాయకులైనవారు వీరి ప్రచారాన్ని నమ్మి మా పైకి వచ్చినతరువాతపశ్చాత్తాపంవెలువరుస్తున్నారు. ప్రజాసేవకులకు కొట్టుటవల్లవచ్చే నష్టం గ్రహించుతున్నారు. అప్పుడే చాలమంది వీరి మాటలను నమ్మని స్థితిలో పడ్డారు. సత్యం దాగుతుందా!

ప్రజలకు మా మనవి

పట్టణంలో గత మూడేండ్లుగా మాపార్టీ ప్రజల కొరకు తీవ్రకృషి చేసింది. 1942 ఆగస్టుఅల్లరులలోపట్టణశాంతికాపాడుటలోను, కాంగ్రెసు సందేశంమూలమూలలకు ప్రచారం చేయుటలోను, కాంగ్రెసు నాయకులను విడుదలకొరకు ఆందోళన చేయుటలోను, 1942 నుండి ఏర్పడిన ఆహారకరువును పరిష్కరించుటలోను, దొంగమార్కెటుమరూపుమాపి ప్రజల నిత్యావసరాలు తీర్చుటలోను, బెంగాల్ రాయలసీమ ప్రజలకు కరువు సమయంలో వేలకొలది ధనం వసూలుచేసి పంపుటలోను, ప్రజాసానుభూతిని ఎంతో పొందాం. నిజమైన ప్రజాసేవకులు వీరేనని గుర్తించునట్లు చేయగలిగాం. అంతేగాదు, పట్టణంలోని కార్మికులకుకార్మికసంఘాలద్వారాను, యువకులవైజ్ఞానిక, మానసిక, ఆరోగ్యాభివృద్ధులకు తోడ్పడ్డ యువజనసంఘాలద్వారాను, రాత్రిపాఠశాలలు నడుపుటవల్ల ఎంతో సేవచేశాం.

ఈనాడు చిట్టి, గణపతిరావుగార్లు యీ విధంగా నీచానికి వడిగట్టి, మమ్మలనేమో చేద్దామనుకోవటం వెర్రిభ్రమ. వీరి కుత్రలు, కుతంత్రాలు ప్రజలలో యీనాడున్న ఐకమత్యాన్ని చెడగొట్టి, మేము నిర్మించిన, నిర్మించుతున్న ప్రజాసంఘాలను విచ్ఛిన్నం చేసి, బ్రిటిషు సామ్రాజ్యవాదులకు, యజమానులకు, దొంగ వ్యాపారులకు సహాయపడుతున్నాయి. ఐక్యత ఒక్కటే మన స్వాతంత్ర్యమార్గం అని ప్రధాన నాయకులంతా పదే పదే చెప్పుతూంటే, స్థానికంగా వీరి చర్యలు కులంలోను, పట్టణంలోను ఐక్యతను దూరంచేసి చీలికలుకలిగించుతున్నాయి. రౌడీల, త్రాగుబోతుల చర్యలు సహించం. తప్పక యెదుర్కొని బుద్ధిగరిపాం, బుద్ధిగరుపుతాం. వీరి నడ్డంపెట్టుకుని, కులంలో పెత్తనం సాగించుదామనుకున్న కుత్ర ఛిన్నాభిన్నం అయిపోయింది. ప్రజావెల్లువ, వాంఛముందు స్వార్ధపరుల నీచకృత్యాలు, తలంపులు భగ్నమౌతున్నాయి. అది యీనాటికైనా చిట్టి, గణపతిరావుగార్లు గ్రహించితే పట్టణ పురోభివృద్ధికి యెంతో మేలు.

— టి. వెంకటేశ్వరరావు

సభలు - సమావేశాలు

★

ఆంధ్రరాష్ట్ర ప్రథమ ట్రేడ్‌యూనియన్ మహాసభ

రాజమండ్రిలో : జూన్ 9, 10

ప్రారంభకులు : కామ్రేడ్ మిరాజ్‌కర్

(అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు నాయకులు)

జండా ప్రతిష్ఠాపన : కామ్రేడ్ చలసానివాసుదేవరావు

అధ్యక్షులు : కామ్రేడ్ సి. వి. కె. రావు

మద్రాసు ట్రేడ్‌యూనియన్ నాయకులు చక్కరై చెట్టియార్, బాలచంద్రమీనన్, రామమూర్తి, కళ్యాణసుందరంగారలు వస్తారు. ఆంధ్ర కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఉజ్వల సందేశమిస్తారు.

ఆంధ్రరాష్ట్ర షెడ్యూల్డ్ జాతుల ప్రథమ మహాసభ

కొవ్వలి : జూన్ 2, 3 తేదీలు

ప్రారంభోత్సవం : ఆర్. ఎల్. బిశ్వాస్‌గారు ఎం.ఎల్.ఏ.(బెంగాల్)

అధ్యక్షులు : ఈలి వాడపల్లిగారు,

పతాకోత్సవం : ప్రత్తిపాటి లక్ష్మయ్యగారు,

2 వ తేదీని రాష్ట్ర షెడ్యూల్డ్‌జాతుల స్త్రీల మహాసభ జరుగును. మీనాంబాళ్ శివరాజ్‌గారు ప్రారంభోత్సవం జరుపుతారు. అధ్యక్షురాలు జాలా మంగమ్మగారు. ఆరోజునే రాష్ట్ర షెడ్యూల్డ్‌జాతుల విద్యార్థి మహాసభ డాక్టర్ కె. రాఘవులుగారి అధ్యక్షతక్రింద జరుగును. వి. కృష్ణస్వామి, ఎం. ఏ. పి. హెచ్. డి. గారు ప్రారంభోత్సవంచేయుదురు.

3 వ తేదీని పి. బాలకృష్ణగారి అధ్యక్షతక్రింద యువజన మహాసభ జరుగును. ప్రారంభకులు మహీపతి ఓబయ్యగారు. రాష్ట్ర షెడ్యూల్డ్ జాతుల మహాసభ 3 వ తేదీని జరుగును.

ప్రతినిధులకు, ప్రేక్షకులకు భోజనం పూటకు 0-2-0. కొవ్వలి ఏలూరు పెద్ద స్టేషన్‌కి 3 మైళ్ళదూరంలో వుంది.

నక్కాచిన వెంకయ్య. (ఆహ్వాన సంఘాధ్యక్షుడు)

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశం

జూన్ 8 నుండి 13 వరకు.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థిఫెడరేషన్ కార్యదర్శి కామ్రేడ్ యస్. వి. నరసయ్య, ఇలా వ్రాస్తున్నారు : కౌన్సిలు సభ్యులందరు 7వ తేదీ రాత్రికి బెజవాడ చేరవలయును. స్థానిక సంఘ కార్యదర్శులు, ముఖ్యకార్యకర్తలు కౌన్సిలు సభ్యులు కాకపోయినా హాజరుకావలయును. కౌన్సిలు కార్యక్రమం 8 వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభింపబడును.

గుడివాడ మోటారు డ్రైవర్లపై యజమాని దౌర్జన్యాలు

మార్చి 14వ తేదీన కతారు సుబ్బయ్య అను మోటారు కంపెనీ యజమాని, వర్కర్సుకు జీతము, బేటా హెచ్చు చేయమన్నారన్న నేరంపై మెరుగుమాల వీరాస్వామి, మెరుగుమాల వెంకటేశ్వరరావు అను బస్సు డ్రైవర్సును, వారులోనే బస్సుమీదనుండి దించివేసి, బస్సులను వశపరచుకొన్నాడు. వీరిద్దరు సర్వీసులోవుండగా బస్సులను ఓవర్ లోడ్ కాకుండా చేస్తున్నారు. వీరిద్దరినీ దించివేస్తే తన యీ బాధ తప్పుతుందని యీపని చేశాడు. డి. ఎస్. పి. కి, తదితర ఆఫీసర్లకు వెంటనే యీ విషయముపై టెలిగ్రాము యిచ్చారు. సబ్ ఇన్‌స్పెక్టరు ఇంక్వైరీతర్వాత 22 వ తేదీన యజమాని వీరిని తిరిగి బస్సుల మీదికియెక్కించినాడు.

తర్వాత డి. ఎస్. పి. డెప్యూటీ పోలీసు సూపరింటెండెంటు ఏప్రిల్ 21, 22 తేదీలలో విచారణచేశారు. ఈవిచారణలో జరిగినవాస్తవాన్ని చెప్పినందుకు మెరుగుమాల వీరాస్వామిని ఏప్రిల్ 23వ తేదీన మళ్లాదిగిపొమ్మన్నాడు. జీతమడిగితే బండబూతులు తిడుతూ దించివేశాడు. తర్వాత తిరిగి పోలీసువారు విచారించినపుడు ఉన్నదున్నట్లు చెప్పినందుకు ఏప్రిల్ 29 వ తేదీన మెరుగుమాల వెంకటేశ్వరరావును దించివేశారు దీనినిగురించి డి. ఎస్. పి. కి అర్జీలు పంపుకొన్నను, ఇంతవరకు ఏమీ సమాధానములేదు; ఇంక్వైరీ కూడా లేదు.

చింతలపూడిలో పోలీసుల దౌర్జన్యం

★

చింతలపూడి తాలూకా రైతుసంఘాధ్యక్షులు కారుమూడి సత్యనారాయణగారిలా వ్రాస్తున్నారు :

ది 17—5—45 తేదీ రాత్రి సుమారు 11 గంటలకు చింతలపూడి (ప॥ గో॥ జిల్లా) స్టేషన్ పోలీసు మోజస్ (నెం 845 రు) అనునతను తప్పత్రాగి, మిరియాల రత్తయ్య, గుంటు రాములు అను రైతులు మాట్లాడుకొనుచుండగా తిట్టి కొట్టబోయెను. అంతలో చుట్టుప్రక్కలవారు సర్దివేసిరి. వెంటనే సదరు పోలీసు, స్టేషనుకు వెళ్ళి యింకా 7 గురు పోలీసులతోవచ్చి వారిద్దరను అరెస్టు చేసిరి. "ఇంకా యిక్కడొక కమ్యూనిస్టు లంజాకొడుకు వున్నాడని" అంటూ ప్రక్కనే వున్న కమ్యూనిస్టు ఆఫీసుపైకి వచ్చి ఆఫీసులోవున్న కామ్రేడ్ యాళ్ళబండి రంగనాయకులు (తా. క. పార్టీ ఆర్గనైజరు)ను, స్టేషనుకు సబ్‌యిన్‌స్పెక్టరు తీసుకు రమ్మన్నాడని చెప్పి, మొదటి యిద్దరితో యీయన్నికూడా కలిపి మెయిన్‌రోడ్డువద్ద ఆపిరి. సూర్యనారాయణ భోజనహోటలులో బూతులు తిట్టుకుంటూ జొరబడి యిల్లంతా వెతికారు. హోటలు అతను లేడని స్త్రీలు చెప్పగా వాళ్ళనుతిట్టి కొట్టబోయారు. తరువాత బైటకు వచ్చి పై ముగ్గురునీ తిడుతూ, లాఠీలతో క్రూరంగా కొడుతూ, కాళ్ళతో తన్నుతూ పోలీసుస్టేషనుకు తీసుకుపోయారు.

ఆ ముగ్గురిలో తాలూకా కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరైన కామ్రేడ్ యాళ్ళబండి రంగనాయకులను లాఠీతో తల పగులగొట్టారు. స్టేషనుకు వెళ్ళిన తరువాత జైలులోవుంచారు. పై ముగ్గురుని తీసుకువెళుతూ, 'కమ్యూనిస్టు లంజాకొడుకులు బయలుదేరిన తరువాతనే యీవూళ్లో బొత్తిగా మనల్ని మెసల్నివ్వడం లేదు. తన్నండిరా' అంటూ నానా అసహ్యకరమైన బూతులు తిట్టారు. మరునాడు, అనగా 18 వ తేదీని పై ముగ్గురు జామీనుమీద విడుదలచేయబడ్డారు.

అసలు యీ తాలూకా చాల వెనుకబడినదైనందున స్థానికంగా పోలీసుజులుం ఎక్కువగా సాగుచుండెను. బాటసారులను హింసించడం, కిరాయిబండ్లవద్ద లంచాలు కాజేయడం దుకాణదారులను బాధించడం మొదలైనవి యిక్కడ పోలీసులకు నిత్యకృత్యం. ఇక్కడకు పార్టీ ఆర్గనైజరు వచ్చినదగ్గర నుంచీ పై దుండగాలేవీ సాగడంలేదు. అంతేకాదు. డిమాన్‌స్ట్రేటరు బ్లాక్‌మార్కెటులో బండిపట్టాలు అమ్ముచుండగా పట్టుకొన్నారు. ఇంకా తెల్లకాగితములు, అగ్గిపెట్టెలు వగైరా వస్తువులు కంట్రోలు ధరలకు మించి అమ్మినందున కూడా కేసులు పెట్టించడం జరిగింది. అందువలన పోలీసు లంచగొండితనం ఎంతమాత్రం సాగుటలేదని, ఏదైనాచేస్తే డిమాన్‌స్ట్రేటరులాంటివారినే పట్టుకున్నవాళ్ళు మనల్నిమాత్రం ఒదిలిపెడతారా అన్న కసికొద్దీ యీదుర్మార్గానికి దిగారు.

ఆంధ్రవిద్యార్థుల కృషి

(6వ పేజీ తరువాయి)

గవర్నమెంటు వెంటనే కరువునివారణకై యీ క్రింది సూచనల నమలు జరుపవలెనని కోరుచున్నాను.

1. ఎక్కువ కరువుక్యాంపులు తెరచుట.
2. ఉచితాసుపత్రులు, భోజనశాలలు తెరచుట.
3. బర్మా కాందిశీకులకు తగు సౌకర్యముల నేర్పరచుట.
4. తిండిసౌకర్యములు కలుగచేయుట.
5. బావులను తవ్వించుట.
6. క్వైనైన్ మొదలైనమందులను విరివిగా అందజేయుట.
7. ప్రజా సంఘముల సహకారం తీసుకొనుట.

సోదరులారా! ఉత్తర విశాఖజిల్లా యీరోజున తిండిలేకనానావిధములైనఅంటుజాడ్యములతో కృంగి కృశించియున్నది. చీపురుపల్లినుండి ఇచ్ఛాపురంవరకు వివిధ జాతుల ఫలవృక్షములతో తులతూగే ఉద్యానవనం అధ్వాన్నంగా తయారయింది. విశాఖజిల్లా కరువు బాధితులకు ఆంధ్ర విద్యార్థి సోదరులు ప్రజలు విరివిగా సహాయపడాలని ప్రార్థిస్తున్నాను.

సవరణ

ఈ సంచికలోనే 12 వ పేజీలో, దక్షిణ విశాఖజిల్లా రైతు మహాసభకు విరాళాలు రు. 25 వేలు వసూలైనట్లు వుంది. అమొత్తం రు. 25 వేలు కాదు, రు. 25 వందలు.

బట్టల బ్లాక్‌మార్కెటు

(7 వ పేజీతరువాయి) సీలింగురేట్లకు అమ్మించారు. బజారంతా తీర్థమే! వచ్చికొనుక్కొనే వారు, "ఇవాళ సుదినం!" అంటూ తిరిగి వెళ్ళారు. ఒకాయన చొక్కాకు సరిపడ్డగుడ్డ తీసుకువెళ్తూ,"అబ్బ! 2 నెలలనుంచి తిరుగుతున్నా, దొరకడం లేదండి. కమ్యూనిస్టు పార్టీవాళ్లు పట్టుకున్నారు గనక యిస్తున్నారు. లేకపోతే యిస్తారా? ఈవర్తకులు యమభటులు కదండీ!" అంటూ వెళ్ళిపోయాడు.

జిల్లా టెక్స్‌టైల్ ఆఫీసరు యీ విధంగా ప్రజాసేవకుల సహాయంతో దొంగ మార్కెటును అరికట్టుచున్నందుకు వారిని అభినందించక తప్పదు. ఇతర ప్రాంతాల్లో కూడా స్థానికాధికారులు యీ మార్గాన్నే అనుసరించడం ఉత్తమం.

'ప్రజాశక్తి' కి మా వంతు

(5వపేజీ తరువాయి)చాలా గొప్పత్యాగం.

తాలూకా మొత్తంమీద చూస్తే అక్కడకు వచ్చిన పార్టీసభ్యులు మాత్రమే 23 వేలు వాగ్దానాలు చేశారు. ఇంకా 17 వేలు ప్రజలలో వసూలు చెయడానికి కార్యక్రమం వేసుకున్నారు.

ఇవన్నీ చూచిన తర్వాత నాకెంతో ఉత్సాహం కల్గింది. ఏ రాజకీయపార్టీ ఈనాడు ఆంధ్రలో ఇంత డబ్బు వసూలుచేయగలదు? 1930 ప్రాంతంలో గాంధిజీ ఆంధ్రప్రాంతంలో తిరిగి డబ్బు వసూలుచేసినప్పుడు తప్ప మరెప్పుడూ యిలా వసూలు చేయలేకపోయారు. ఈనాడు కమ్యూనిస్టుపార్టీ అయిదు లక్షలు వసూలు చేస్తోందంటే పార్టీయందు ప్రజలకున్న అభిమానం రుజువవుతోంది.

— మా విలేఖరి

"ప్రజాశక్తి" కి ప్రజలే పోషకులు

దివి తాలూకా: రు. 53,476

ఆంధ్రలో కమ్యూనిస్టుపార్టీ ప్రజాపార్టీగా అభివృద్ధి పొందుతూంది. ఈ పరిణామం స్పష్టంగా కనబడుతూన్న ప్రాంతాల్లో దివి తాలూకా (కృష్ణాజిల్లా) ఒకటి. దైనందిన సమస్యలను తీసుకొని పాటుపడుతూ, ప్రజల్ని ముందుకు తీసుకుపోతున్న పార్టీకి దినపత్రిక చాల అవసరమని గుర్తించి, దానికోసం తహతహ లాడుతూన్నవారిలో దివి తాలూకా ప్రజలొకరు. "ప్రజాశక్తి దినపత్రిక కోసం 5 లక్షల నిధిని పోగుచేయండ"ని కామ్రేడ్‌సుందరయ్య ఇచ్చినపిలుపు అక్కడి పార్టీసభ్యులకు, సానుభూతి పరులకు బ్రహ్మానందం కూర్చింది. దినపత్రిక వచ్చేసిందనే సంతోషించారు.

కృష్ణాజిల్లా కమిటీ దివి తాలూకాకు రు. 50 వేలు కోటా నిర్ణయించింది. యీ నిధిని వసూలు చేయడానికి తగిన ప్లాను వేసుకోడానికి తాలూకాలోని పార్టీసభ్యుల, సానుభూతిపరుల సమావేశాన్ని మొన్న 18 తేదీకి చల్లపల్లిలో ఏర్పాటుచేశారు.

ఆ వేళ ఎండ మహాతీక్ష్ణంగా ఉంది. కామ్రేడ్సు రావడం ఆలస్యమవుతుందేమోనని అనుమానం కలిగింది. కాని ఒంటిగంటకల్లా 250 మంది సభ్యులు, సానుభూతి పరులు, వచ్చిచేరుకున్నారు. వారికి విశ్రాంతి యిచ్చి, సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభించాలని నిశ్చయించారు.

సాయంత్రం 4 గంటలకల్లా 50 గ్రామాల నుండి 325 మంది పార్టీసభ్యులు, సానుభూతి పరులువచ్చారు. వీరిలో వందమందికిపైగా సానుభూతిపరులు. కుల-మతభేదాలు ఆకూటమిలో సమసిపోయాయి.

ఏడు సంవత్సరాల బాలసంఘ సభ్యులు మొదలుకొని, 54 ఏళ్ళ వృద్ధులవరకు సభకు వచ్చారు. 30 మైళ్ళ దూరం నుంచి నడిచి వచ్చినవారుకూడా ఉన్నారు. యువజనసంఘ కార్యక్రమంతో ఉత్సాహమూ, చైతన్యమూ, పొందిన యువకులు, పెద్దలు 30 మంది ఘంటసాల నుండి వచ్చారు. నాగాయితిప్ప రైతుమహాసభతో దీక్ష పరతంత్రులయిన రైతులు ఆ గ్రామం నుంచి వచ్చారు. జమీందారీ వ్యతిరేక పోరాటంలో కాకలుదీరిన మంగళాపురం ఓరుగంటి రెడ్లు; తమ గ్రామ ఉమ్మడి పాటిమట్టిని దక్కించుకోడానికి తీవ్రకృషి చేసిన వక్కలగడ్డ యువకులు-సభనలంకరించారు. తమ తమ ప్రాంతాలలో గ్రామజీవనాన్ని సుఖవంతంచేయడానికి నిరంతరం కృషిచేస్తున్న యోధులే అక్కడికి వచ్చినవారంతా. నవయుగనిర్మాతలు వారు.

దిన పత్రిక అవసరం

కామ్రేడ్ బుచ్చికోటయ్య అధ్యక్షతను "నవయుగ నిర్మాత వీవెగా" అనే పాటతో సభ ప్రారంభమయింది. కామ్రేడ్ రాజేశ్వరరావు అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులపై 4½ గంటలసేపు మాట్లాడారు. నాజీజం నాశనం కావడంతో యూరపులో ఎలా ప్రజారాజ్యాలు నిర్మాణ మవుతున్నాయో వివరించారు. మిత్రరాజ్య ప్రజలమధ్య చీలికలు తేడానికి ప్రయత్నించే ప్రజాద్రోహులందరూ తప్పకుండా పరాజితు లవుతారన్నారు. మన దేశంలో కాంగ్రెసువారు అనుసరిస్తున్న సంకుచిత విధానంవల్ల కాంగ్రెసు మహాసంస్థ ఎలా బలహీనమవుతుందో వివరించారు. "చల్లపల్లి జమీందారు కాంగ్రెసు సానుభూతి పరుడు" అని గొట్టిపాటి బ్రహ్మయ్య ఒక ఉపన్యాసంలో అన్నాడంటే - ఇలాంటివారు కాంగ్రెస్ మహాసంస్థను ఏ గోతిలోకి తీసుకుపోతున్నారో స్పష్టమవుతుంది. ఇలాంటివారి కుతంత్రాలను తూర్పారబట్టి ప్రజావుద్యమాన్ని సక్రమమార్గాన నడపాలంటే 'ప్రజాశక్తి' దినపత్రిక అవసరమని ముగించారు.

వాగ్దానాల వర్షం

ఇక వాగ్దానాల వర్షం కురియ నారంభించింది. రు. 5 లు మొదలు రు. 10,000 ల వరకూ వాగ్దానాలున్నాయి.

దివిసీమ సెల్సువారీగా రు. 5875 లు వాగ్దానం చేసింది. చల్లపల్లి ఫిర్కావంతు వచ్చింది. మాలెంపాటిసీతారామయ్య 1943లో పార్టీ నిధికి రు. 10,000 ఇచ్చాడు. తిరిగి ఇప్పుడు రు. 5000 లు వాగ్దానం చేశాడు. యువజన సంఘాధ్యక్షుడు రావి దుర్గారావు 1943 లో పార్టీకి రు. 5000 లు ఇచ్చాడు. ఇప్పుడు "ప్రజాశక్తి"నిధికి మళ్ళీ రు.5000లు వాగ్దానం చేశాడు. ఆపైని మంగళాపురం. తాలూకా రైతుసంఘ అధ్యక్షుడు చంద్ర రామలింగయ్యగారి వాగ్దానం ఎంతోతెలుసుకోడానికి అందరూ ఉత్సాహపడ్డారు. తనవంతు రు. 10,000 లు అని తెలిపేసరికి ఎంతో సంతోషించారు. గ్రామసెల్లు మరో రు 1500 వాగ్దానం చేసింది. ఈవిధంగా చల్లపల్లిఫిర్కా మొత్తం రు. 30,435 లు వాగ్దానం చేసింది.

కాజ ఫిర్కాలో భట్లపెనుమర్రు పార్టీనిధి వసూళ్ళలో అగ్రస్థానానికి ఎప్పుడూ పోటీ పడుతుంటుంది. ఈసారి రు. 10,000 వాగ్దానంచేసింది. కూచిపూడి సెంటరు రు.5000, పెదముక్తేవి రు. 2116, నిడుమోలు రు. 250, మొత్తం 17,366 రూపాయలు వాగ్దానం.

ఈవిధంగా తాలూకాలో మొత్తం 53,676 రూపాయలు వాగ్దానాలు వచ్చాయి. కోటాను మించిపోయాయి వాగ్దానాలు.

ప్రజల పార్టీ

ఈ వాగ్దానాలు చేసిందెవరు? రైతుబాబులు, రైతు కుమార్లు, రైతు కుమార్తెలు, వ్యవసాయ కూలీలు - కష్టజీవులు. కమ్యూనిస్టు పార్టీ ప్రజల ఆదరాభిమానాలను ఎంతగా చూరగొందో దివితాలూకా పార్టీసభ్యుల సభ వెల్లడి చేసింది. నిర్మాణ కార్యక్రమంపేరిట కొందరు కాంగ్రెసు ప్రముఖులు తాలూకాలో ఎంతో నీచంగా పార్టీ వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నారు. పార్టీపై ద్వేషంకొద్దీ చల్లపల్లి రాజాలాంటి ప్రజాద్రోహుల అండ చేరుతున్నారు గొట్టిపాటి బ్రహ్మయ్య మొదలైనవారు. కమ్యూనిస్టుపార్టీస్థానం ఎక్కడుందో, కాంగ్రెసు పెద్దలమని చెప్పుకునే ఇలాంటివారి స్థానం యెక్కడుందో దివితాలూకాసభ స్పష్టపరిచింది. ప్రజల్లోనుంచి కమ్యూనిస్టుపార్టీని దూరంచేయడం ఎవ్వరి తరమూకాదని నిరూపించింది.

రెండు సంఘా లనవసరం

—///—

(12 వ పేజీ తరువాయి)రామలింగయ్య జిల్లాలోనిరైతుఉద్యమాన్నిగురించిఉపన్యసించారు జిల్లా కమ్యూనిస్టు నాయకులలో ఒకరైన కామ్రేడ్ వై. విజయకుమార్ మహాసభను ప్రారంభించారు. జిల్లాలో రైతుసంఘం యీ 2 సంవత్సరములలో సాధించిన విజయాలను వివరించి, "మన జిల్లాలో రైతుసంఘ వలుకుబడి మారుమూల గ్రామాలకుగూడ ప్రాకిపోతున్నది. కాని రైతాంగానికి యింకా అనేక కష్టాలున్నాయి. ప్రక్కనున్న ఉత్తర విశాఖను రక్షించుకోవాలి. అధికోత్పత్తికి యింకా యెక్కువగా కృషిచేయాలి. ప్రభుత్వాన్ని ఒత్తిడిచేసి, మన కోర్కెలను సాధించుకోవాలంటే రైతులు, కూలీలు ఏకంగావాలి. బాధ్యతలన్నీ నిర్వహించటానికి, విచ్ఛిన్నకుల ఆటలు సాగనివ్వకుండా చేయడానికి, మీ సంఘాన్ని అభివృద్ధి చేసికొని బ్రహ్మాండమైనవుద్యమంగా వృద్ధిచేయాల"ని చెప్పారు.

డాక్టరు పాలకోడేటి గురుమూర్తిగారు (ఆంధ్ర మెడికల్ ఎసోసియేషన్ అధ్యక్షులు) పండిట్ ఉన్నవ రామలింగంగారు (బరంపురం), అనిశెట్టి సుబ్బారావుగారు మహాసభ జయప్రదంగా జరగాలని పంపిన సందేశాలు చదువబడ్డాయి.

అధ్యక్షోపన్యాసం

తరువాత అనేక జమీందారీ పోరాటాల్లో పాల్గొని కృష్ణాజిల్లారైతుసంఘమును నిర్మించి బలపరచి, ప్రస్తుతం కృష్ణాజిల్లా రైతుసంఘానికి అధ్యక్షులుగా ఉంటున్న శ్రీ అనుమర్లపూడి సీతారామారావుగారు కరతాళ ధ్వనుల మధ్య లేచి ఉపన్యాసం ప్రారంభించారు. "మన అందరకు రష్యా ఆదర్శప్రాయంగా వుంది. జమీందారులు, లంచగొండులు, ప్రజల్నిపీడించుకుతినే అధికారులు-ఇలాంటివారికి అక్కడ స్థానంలేదు. అక్కడ రైతులు మానవజాతికి శత్రువైన ఫాసిజాన్ని ధ్వంసం చేస్తున్నారు. అట్టి రష్యాపై దుష్ప్రచారం చేసేవారిని ఏమనాలో మీరే ఆలోచించండి.

"ఈనాడు రైతుల కష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. కావలసినంత తిండి, బట్ట లేక బాధపడుతున్నారు. రైతులను చైతన్యవంతులుగాచేసి, ఐక్యపరచి, వారి కష్టాల్ని తీర్చుటకు పాటుపడ్డానికి బదులు రంగా, కాశేశ్వరరావు, మొదలగువారు పోటీ సంఘాలనుపెట్టి ఉద్యమాన్ని విచ్ఛిన్నంచేయబూనుకున్నారు.

"మన జాతీయనాయకులు ఇంకా జైళ్లలో మ్రగ్గుతున్నారు. ప్రజలు కరువు కాటకాలతో కుమిలిపోతున్నారు. మననాయకులను బయటికి తీసుకురావలసినబాధ్యత మనపైనున్నది. అందుకై మనం అంతా ఏకంగావాలి. విచ్ఛిన్నకుల ఆటలు సాగనివ్వకూడదు.

"మీరంతా అనేక కష్టాలకు లోనవుతున్నారు. వందలకొద్దీ ఎస్టేట్లున్న మీ జిల్లాలో ప్రభుత్వమే చెర్వుల మరమ్మతు చేసేలా ఆందోళన సాగించాలి. గ్రామంలో రైతుల్ని బాధపెడుతున్న జమీందారీ ఉద్యోగులు, పెత్తందార్లు, ఇనాందారులు - వీరందరి అత్యాచారాలను అరికట్టి రైతు వుద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలంటే రైతులంతా నూటికి నూరుమంది సంఘంలో సభ్యులుగా చేరాలి.

"ఉత్తర విశాఖలో లక్షలకొద్దీ అంటురోగాలతోను, కరువుతోను పీడించబడుతున్న రైతుకూలీ స్త్రీ పురుషులకు ఎక్కువ పంటలు పండించి ప్రాణభిక్ష పెట్టండి. ప్రజల్ని బ్రతికించడంకన్న నిర్మాణ కార్యక్రమం యింకొకటి లేదు" అంటూ ఉత్తేజకరంగా ఉపన్యసించారు.

కామ్రేడ్స్ గోవిందరావు, యమ్. వి. రమణమూర్తిగారలు తొలిరోజున ఆమోదించబడిన తీర్మానాల సారాంశాన్ని వివరించారు.

వైజ్ఞానిక కార్యక్రమం

రాత్రి 10 గంటలకు వైజ్ఞానిక కార్యక్రమం ప్రారంభమయింది. మునగపాక బాలసంఘం వారు "మాసొక్క పొలిమేరలోనా" అని కోలాటంచేశారు. కోలాటం ఎంతో చక్కగా వుందని అందరూ చకితులయ్యారు. చూచుకొండ దళంవారు "రైతుజండా"అనే నాటకం ప్రదర్శించారు. ఆఖరున కృష్ణాజిల్లా బుర్రకథ దళంవారు "కష్టజీవి" బుర్రకథ అత్యద్భుతంగా చెప్పారు. బుర్రకథ వినడం విశాఖ జిల్లావారికి మొదటిసారియైనా, మావూరు రావాలంటే మావూరు రావాలని పట్టుబట్టారు. ఎంతైనా డబ్బిస్తామన్నారు.

స్థానిక కాంగ్రెసువాదియైన శ్రీ గర్రింధి కన్నయ్యగారు లేచి, "ఈ జిల్లాలో యింత పెద్ద మహాసభ జరుగుటకిదే మొదటిసారి. ఇంత పెద్ద మహాసభ జరిపినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. రైతు వుద్యమం కాంగ్రెసుకు వ్యతిరేకం కాదు. జాతీయోద్యమానికి యిది అండగావుంది. ఒకే ఆశయం కోసం పాటుబడేవారంతా ఐక్యంగా పని చేయాలి. రెండుసంఘా లనవసరం. వెనుకబడ్డ విశాఖ జిల్లాలో యింత వుద్యమం నిర్మించడం గర్వించదగిన విషయం. మీరు ఖాదీ వుద్యమం కూడా అమల్లో పెట్టాలి. బెంగాలులోనూ, దేశమంతటిలోనూగుడ్డ లేకచస్తున్నారు. అందువల్ల అందరూ ఖాదీకూడా తయారు చేయాలి."

"రైతుసంఘానికి జై, ఎరజెండాకు జై" అనే నినాదాలతో సభ ముగిసింది.

(2వపేజీ తరువాయి) బాడుగబళ్ల తోలకమో మినహా వేరు వృత్తి ఏమీలేక, కేవలం తమ స్వల్ప భూవసతిమీదనే ఆధారపడి జీవించే వారందరికీ పూర్తిగా శిస్తులు మాఫీచేయుటకై ఈ వ్యవసాయాదాయపు పన్నును వినియోగించాలి.

పై సూచనలను చేస్తూ మద్రాసు ప్రభుత్వానికి ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం ఒక మెమోరాండమును సమర్పించింది. ఈ సూచనలతో బిల్లును బలపరచడం సమంజసమని ప్రతి రైతాంగ శ్రేయోభిలాషి అంగీకరించుతాడు. కాబట్టిబిల్లును బలపరుస్తూపైసూచనలనుచేస్తూ రైతులంతాఆందోళన చేయవలసినదిగా కోరుతున్నాను.

రైతులు ప్రజల ప్రాణాలు నిలపాలి

దక్షిణ విశాఖ రైతుమహాసభ

దక్షిణ విశాఖలో రైతుఉద్యమం సంఘటిత రూపంలో ప్రారంభమయి 2 సంవత్సరాలు మాత్రమే అయింది. అంతకు పూర్వం మందేశ్వరశర్మగారి రైతుసంఘాలు నామమాత్రంగా వుండేవి. అవి సభ్యత్వ రుసుము వసూలు చేయడం మినహా, మరేమీ చేయలేదు.

ఈ జిల్లాలో జమీందార్లు, ఇనాందార్లు, మొఖాసాదార్లు ఎందరో వున్నారు. వీరు వేలాదిగా వున్న చెరువులను 20, 30 సంవత్సరాల నుండి మరమ్మతులు చేయించకపోవుటచే, మేటవేసి అధ్వానంగా పడివున్నాయి. రైతులు ఎన్నిసార్లు పిటీషన్లుపెట్టి మొరపెట్టుకున్నా వినరు. ఎట్టిరెమిషన్లు ఇవ్వకశిస్తులకు మాత్రం పీడించి వసూలుచేస్తారు. బకాయిలు వసూలు చేయడానికి జప్తులు. వేలాలు ఖచ్చితంగా అమలు జరుపుతారు. రైతులు ఆర్థికంగా చితికిపోవుటచే శిస్తులు, బకాయిలు సక్రమంగా చెల్లించుకోలేక ఎస్టేటు, రివెన్యూ వుద్యోగస్తుల లంచగొండి తనానికి బలి అవుతుంటారు. అనేకచోట్ల ఈనాం రైతులకు (ఏకపట్టా గ్రామములలో నైతం) జిరాయితీ హక్కులు లేవు. యుద్ధం వచ్చిన తర్వాత నానాటికి రైతుల బాధలు అధికమయ్యాయి. బియ్యం, కిరోసిన్ బట్ట - యితర అన్నివస్తువులకు కరువువచ్చి రైతులు, కూలీలు అమితంగా బాధపడ్డారు. దొంగమార్కెట్టు విపరీతంగా పెరిగిపోయింది.

ఈ ప్రాంతం ఆర్థికంగానేగాక, రాజకీయంగాకూడా వెనుకబడ్డది.

ఈవిధంగా ఆర్థికంగాను, రాజకీయంగాను వెనుకబడియున్న దక్షిణ విశాఖజిల్లా రైతాంగానికి రైతుసంఘం ఒక వెలుగులా కన్పించింది. నిరాశ, నిస్పృహలతో కృంగిపోతూ, ప్రభుత్వ ఉద్యోగస్తుల, ఎస్టేటు వుద్యోగుల, గ్రామపెత్తందార్ల దౌర్జన్యాలకు గురి అవుతున్న రైతాంగానికి, తమ కష్టాన్ని తీర్చుకునే మార్గం చూపింది రైతుసంఘం.

రెండు సంవత్సరాల కృషిఫలితం

ఈ 2 సంవత్సరాలలోనూ రైతుసంఘం అనకాపల్లి, విశాఖ, చీపురుపల్లి తాలూకాలకు వ్యాపించి, దినదిన ప్రవర్ధమానం అయి, ఈనాడు 9000 సభ్యత్వంగలిగి యుంది. పోలీసుఅత్యాచారాలను అరికట్టి, ప్రజలు తమ పౌరసత్వ హక్కులు కాపాడుకునేలా చేయగలిగింది. కరువుకాటకాలను పోగొట్టేందుకు రైతుల్ని అధికపంటలు పండించాలని ఉత్తేజపరచింది. దీని ఫలితంగానే అనకాపల్లి, విశాఖ తాలూకాలలో 9 చెరువులను, ఒక కాల్వను రైతుసంఘమే కంట్రాక్టు తీసుకొని బాగుచేయించింది. పై 3 తాలూకాలలో మొత్తం 30,000 రూపాయల మొత్తాన్ని వ్యవసాయశాఖవారు ఎరువులకు, విత్తనాలకు వడ్డీలేకుండా అప్పులిచ్చేలా చేసింది. చీపురుపల్లితాలూకాలో, 1943 అక్టోబరులో వచ్చినగాలివాన ఫలితంగా విత్తనాల కొరతఏర్పడినప్పుడు రైతుసంఘం ప్రభుత్వాన్ని ఒత్తిడిచేసి, 4000 బస్తాల విత్తనాలను సప్లయి చేయించింది.

రైతుసంఘం చేసిన ఈ కృషిని రైతులంతా గుర్తించి, రైతుసంఘ కార్యక్రమాన్ని అనేకగ్రామాలలో అమలుజరప నారంభించారు. అనకాపల్లి తాలూకాలో మారుమూల గ్రామాల నుండి కూడా రైతుసంఘ కృషినిగూర్చి తెలుసుకొని, "మాకుకూడా సంఘం ఏర్పరచండి" అని అత్యుత్సాహంతో ముందుకొస్తున్నారు.

మే 5, 6 తేదీలలో కశింకోట (అనకాపల్లి తాలూకా) గ్రామంలో జరిగిన దక్షిణ విశాఖ జిల్లా రైతుమహాసభయే దీనికి నిదర్శనం.

"రావాలి రావాలి రైతన్నా...."

కశింకోటలో రైతుసంఘం ఏర్పడి 6 మాసాలేఅయినా "రైతుమహాసభమాగ్రామంలోనే జరపాలి. మీరంతా యింత కష్టాలు పడుతూ రైతుల మేలుకోసం పాటుపడుతున్నపుడు, మేము మాత్రం ఎందుకు కష్టపడం? దానికి మేమంతా పూనుకొని శాయశక్తులా సహాయం చేస్తాం" అన్నారు ఒక పెద్దరైతు ఎల్లపు అప్పన్నగారు. మహాసభ పందిళ్ళకు కమ్మ, వెదురు, రాటలు చాలావరకు ఉచితంగా వచ్చాయి. చెరుకుదవ్వ ఉడుపులు జోరుగా జరుగతున్నా, కశింకోట రైతులు తీరికచేసుకొని, రాత్రిళ్ళు వెన్నెల్లో, "రావాలి రావాలి రైతన్నా!" అనిపాడుకుంటూ పందిళ్లువేశారు. రైతులే గాకుండా గ్రామంలోని మొఖాసాదారులు, ఇనాందారులు, టీచర్లు - అంతా తమకుతోచిన సహాయం చేశారు. "ప్రపంచం అంతా మారిపోతున్నది. రైతులు, కూలీలు చైతన్యంతో ముందుకొచ్చి ప్రజారాజ్యం తీసుకొస్తే అంతకన్నా మాకు కావలసినదేమిటి?" అంటూ మొఖాసాదారైన శ్రీ మారెళ్ళ అచ్యుతంగారు రు. 100 లు విరాళం మహాసభ ఖర్చుల నిమిత్తం యిచ్చారు.

25 మంది వలంటీర్లు 5 దళాలుగా వెళ్ళి సుమారు 70, 80 ముఖ్యగ్రామాలలో ప్రచారం చేశారు. అత్యుత్సాహంతో ప్రజలు వస్తామని వాగ్దానం చేశారు. మొత్తం మహాసభకు 25 వేలు రూపాయలు వసూలైంది.

కాని ఆహ్వాన సంఘానికి పెద్ద చిక్కు వచ్చి పడింది. ఏప్రిల్ 15 వ తేదీనుండి విశాఖజిల్లా అంతటా 'ఇన్ఫార్మల్' రేషనింగు అమలు జరుపబడింది. రైతులవద్దనున్న అదనపు ధాన్యాన్ని సేకరిస్తున్నారు. ఈ సన్నిస్థితుల్లో ప్రేక్షకులకు, ప్రతినిధులకు, వాలంటీర్లకు భోజనం పెట్టేదెలా? అనే సమస్య వచ్చింది. కనీసం ప్రతినిధులకు వాలంటీర్లకైనా ఆ రెండు రోజులకు రేషను యివ్వమని జిల్లా అధికారులను అడిగారు. కాని, వీరు దానికి కారణంకూడా చెప్పకుండా మాట్లాడక వూరుకున్నారు. గ్రామస్థులంతా ప్రభుత్వ చర్యను ఏవగించుకున్నారు. కాని యింత మాత్రాన మహాసభ ఆగుతుందా? రైతులు యింటింట ధాన్యం వసూలుచేసి, కావలసిందల్లా ఒక రోజులో సేకరించారు.

ఇక రెండు రోజులుంది మహాసభకు. తొలకరి వర్షాలు పడుతున్నాయి. కామ్రేడ్ మైనేని నారాయణమూర్తి (విశాఖ తాలూకా రైతుసంఘ అధ్యక్షులు) వంట్లో అస్వస్థతగా వున్నా, మహాసభకు పందిళ్ళు అతిచురుకుగా పూర్తిచేయిస్తున్నాడు. కాని ఒకరోజున వర్షంతో పందిళ్ళన్నీ పడిపోయాయి. మళ్ళీ ఒక రోజులో, వలంటీర్లంతా అహర్నిశలు పనిచేసి పందిళ్లను తిరిగివేశారు.

5 వ తేదీ ఉదయం, కశింకోట గ్రామం వెలుపల ఒక పూలతోటలో 3 ఎకరాలలో పందిళ్లు చక్కగావేయబడివున్నాయి. విశాఖజిల్లా రైతాంగానికి అపారసేవచేస్తూ మృత్యువాతబడిన పుల్లెల శ్యామసుందరరావు సుస్మరిస్తూ రైతునగరానికి సింహద్వారం "శ్యామసుందర్ గేటు" ఏర్పాటుచేయబడింది. "కరుణాకరంసుబ్బారావు", "కె.యస్.గుప్త" గేట్లుకూడా అతి చక్కగా ఏర్పాటుచేయబడ్డాయి.

ప్రతినిధులసభలో తీర్మానాలు

సాయంత్రం డెలిగేట్లుసభ శ్రీ అనుమర్లపూడి సీతారామారావుగారి అధ్యక్షతను జరిగింది. సభకు మొత్తం 3 తాలూకాలనుండి 30 మంది ప్రతినిధులు హాజరయ్యారు ప్రముఖ కాంగ్రెసునాయకులైన శ్రీ కె. ఎస్. గుప్తగారి మరణానికి సంతాపాన్ని వెలిబుచ్చుతూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియపరుస్తూ తీర్మానించారు. చీమూరు, ఆష్టి, కులశేఖరపట్నం ఖైదీలకు ఉరిశిక్ష తప్పించాలనీ, కాంగ్రెసు నాయకులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలనీ కోరారు. బెర్లిన్ పైఅరుణపతాకము నెగురవేసి, ఫాసిస్టులను నాశనంచేస్తూ ప్రపంచ ప్రజలకు విముక్తిని కల్గిస్తున్న రెడార్మీకిజోహారులర్పించారు. ధాన్యసేకరణ విషయంలో పంట అంచనా లోపాలను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ, రైతాంగమంతా ధాన్యసేకరణ, రేషనింగు, జయప్రదంగాసాగుటకు తోడ్పడాలనీ; మద్రాసు ప్రభుత్వం తుంపాల పంచదారఫ్యాక్టరీ ఏరియాలో ఏర్పరచిన జాయింటు కమిటీకి చెరుకు ధర, ఫ్యాక్టరీ ఏరియాలను నిర్ణయించుటకు అధికార మివ్వాలనీ; వ్యవసాయఆదాయపుపన్ను బీదరైతులకేవిధంగానునష్టదాయకము కానందున దానిని ఆమోదించుచూ, 250 రూపాయలకు తక్కువ నికరాదాయము వచ్చు రైతులకు పన్ను తీసివేయాలనీ, బెల్లానికి యింపీరియల్ మణుగుఒకటికి రు. 9—8—0 లు నిర్ణయించి వాగనుసప్లయి సక్రమంగా చేయాలనీ; జమీందారీ చెర్వుల మరమ్మత్తుకు 1943 ఇరిగేషన్ చట్టాన్ని అమలుపరుస్తూ ప్రభుత్వమే తక్షణం పూనుకొని బాగుచేయించాలనీ; 'ఇనాం' ఆక్టును శివార్లు, ఖండ్రికలు గూడ ఎస్టేట్లుగా పరిగణిస్తూ సవరించాలనీ; పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మించాలనీ; ఉత్తర విశాఖ రోగపీడితులను కాపాడాలని రైతాంగానికి పిజ్ఞప్తి చేస్తూ; ప్రభుత్వం వెంటనే తగు క్షామ నివారణ ప్రయత్నములు చేయాలనీ; "ప్రజాశక్తి" పత్రికను దిన పత్రికగా చేయుట కనుమతి నివ్వాలని కోరుచూ తీర్మానాలు చేయబడ్డాయి.

మునగపాక రైతుసంఘానికి ఎర్ర నక్షత్రం

ఉదయం 10 గంటలయింది. దూరంగా బ్యాండు ఎక్కడో వినిపిస్తోంది. మునగపాక నుండి 1000 మంది రైతులు బారులుదీరి పాటలు పాడుకుంటూ వస్తున్నారు. మధ్యాహ్నానికి, రాత్రికి భోజనాలు మూటగట్టుకొని వచ్చారు. వారి గ్రామములో 6000 మందికి 1000 మంది రైతులు సంఘ సభ్యులుగా చేరినందుకు, ఆ గ్రామ రైతుసంఘానికి జిల్లా రైతుసంఘం ఎర్ర నక్షత్రం బహుమానమిచ్చింది. అంతేగాదు, ఆంధ్రరాష్ట్రమంతటిలోను 1000మంది సభ్యులను చేర్పించిందీ ఒక్క గ్రామమే. అన్ని సమస్యలలోనూ ముందు నిల్చొని, పరిష్కరిస్తూ నానాటికి బలపడుతూ ఆదర్శప్రాయంగా పనిచేస్తూవుంది. రైతు మహాసభకు కూలీలు మజ్జిగ కావిళ్లతో తీసుకువచ్చారు. మూలపేట, నూచుకొండ, నాగులాపల్లి మొదలైన అనేక గ్రామాలనుండి కూరలు వచ్చాయి. ఉదయం 11 గంటలకు సోవియట్ చిత్ర ప్రదర్శనం, ఆరోగ్య ప్రదర్శనం తెరువబడ్డాయి. హెల్తు డిపార్టుమెంటువారు కోరుటతోడనే వచ్చి ప్రదర్శనం చేశారు. సోవియట్ రష్యాలో రైతుల సమిష్టి వ్యవసాయ పద్ధతి చూచి మురిసిపోయి మా కా ట్రాక్టర్లెప్పుడు వస్తాయి - అంటూ ప్రశ్నలవర్షం కురిపించారు రైతులు.

నాలుగువేల మందితో ఊరేగింపు

ఊరేగింపు బయల్దేరింది. మహాసభాధ్యక్షులు అనుమర్లపూడి సీతారామారావుగారు, జిల్లా రైతునాయకులు కామ్రేడ్స్ జొన్నలగడ్డ రామలింగయ్య, కోడుగంటి గోవిందరావు మొదలగువారు రెండుజతల ఎడ్లబండిపైఆసీనులయ్యారు. ఊరేగింపులో సుమారు 4000 మంది స్త్రీపురుషులు అత్యుత్సాహంతో పాల్గొన్నారు. కశింకోట గ్రామస్థులు ఇంతటి అపూర్వ దృశ్యాన్ని ఎన్నడూ చూడలేదు. వాలంటీర్లు శిక్షణతో ఊరేగింపును నడిపించారు. నాయకుల బండితోవున్న రైతు ఉత్సాహం పట్టలేక స్వయంగా నినాదాలివ్వడం ప్రారంభించాడు.

తర్వాత కామ్రేడ్ అబ్బాయినాయుడు (జిల్లా రైతునాయకులలో ఒకరు) ఎర్రజండానెగురవేశారు. ఈ ఎర్రజండా ఛాయక్రింద ప్రపంచ ప్రజలు ఏ విధంగా స్వాతంత్ర్య పోరాటాలు నడిపి విముక్తిపొందుతున్నారో తెలియచెప్పి, "యీజండా కాంగ్రెసుజండాకు వ్యతిరేకమని కొందరు ప్రచారం చేస్తున్నారు. ఎర్రజండాక్రింద జరిగిన ప్రతిఉద్యమము జాతీయోద్యమానికి తోడ్పడింది. విచ్ఛిన్నకులను దూరం చేసి, మీ కష్టాలను తీర్చుకోవడానికి ఎర్రజండా నీడను రైతాంగమంతా ఏకంగావా"లని ఉద్బోధించారు.

తర్వాత మహాసభ ప్రారంభమైంది. సభకు సుమారు 8000 మంది స్త్రీ పురుషులు వచ్చారు. అందులో స్త్రీలు సుమారు 600 మంది. కొందరు 10, 12 మైళ్ళ దూరం నుండి కూడా నడిచివచ్చారు. ఎన్నడూ ఇట్టి మహాసభకు వచ్చేసాంప్రదాయంలేక పోయినా 600 మంది స్త్రీలువచ్చి రాత్రంతా వుండటం గొప్పవిషయం. కశింకోటగ్రామంలోని మధ్యతరగతి స్త్రీలు కూడా చాలమంది వచ్చారు.

ఆహ్వానసంఘ కార్యదర్శి పెంటకోట వెంకట రమణగారు నాయకులకు, ప్రేక్షకులకు స్వాగతమిచ్చారు. ఆహ్వానసంఘం తరపున కామ్రేడ్ (మిగతా 11 వ పేజీలో)

మా విలేఖరి

Editor : M. Chandrasekhara Rao, Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada

END OF ISSUE